సహజీవన భావనల పావురాయి
# గీటురాయి
వారపత్రిక 9-8-2024 15/-



# పద్మవ్యూహం






సహజీవన భావాల సారథి
గీటురాయి
వారపత్రిక
GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 32 హైదరాబాద్
శుక్రవారం 9 ఆగస్టు 2024 రూ.15-00
4 సఫర్ 1446 హిజ్రీ

**తొలిగీటు**

**వస్తువు పంపకంలో మీ పిల్లలందరి పట్లా న్యాయంగా, సమానంగా వ్యవహరించండి.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)

**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**


**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

**గ్రాఫిక్స్**
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

**సర్క్యులేషన్ మేనేజర్**
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**




# లోపల...


| | | |
|---|---|---|
| లవ్ జిహాద్ | ...... | 04 |
| పద్మవ్యూహం | ...... | 05 |
| చరితార్థులు-2 : బేగం ఆమిన తయ్యబ్జీ | ...... | 11 |
| దేవుని బెబ్బులి!! – 41 | ...... | 12 |
| తెలుగు సాహిత్యంలో ఇస్లాం వాదాన్ని ఆవిష్కరించిన కరీముల్లా | ...... | 15 |
| బరువుల్ని ఎత్తుకోండి! భారంగా మారకండి!! – 4 | ...... | 16 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) | ...... | 18 |
| అడుగుజాడలు | ...... | 19 |
| భారతీయ సమాజంలో సత్య సందేశం | ...... | 20 |
| తల్లిదండ్రుల సేవలోనే మన సుఖసంతోషాలు | ...... | 22 |
| అల్లాహ్ నిషేధించిన విషయాలు ఏవి? | ...... | 24 |
| ఉర్దూ లైబ్రరీల కథ! | ...... | 26 |
| నోరు మంచిదైతే.... | ...... | 30 |
| సంక్షిప్త భారతం | ...... | 32 |
| సర్వత్రా | ...... | 33 |
| స్నేహం | ...... | 34 |


**సీఎం VS సబిత**




యేపార్టీలో ఉన్నగాని
కమిట్మెంటుతో ఉన్నం
యే రోటికాడ పాటను
ఆ రోటికాణ్నె పాడినం!
ఎందుకయ్య మాపైన
వేస్తున్నవు నిందలు
తొంగిచూసి తెల్సుకో
ఎవరో గురివిందలు!!

**– యం.డి. ఉస్మాన్ ఖాన్**

ఆలోచన

# లవ్ జిహాద్

**మరోసారి** లవ్ జిహాద్ చర్చ మొదలయ్యింది. ఈసారి చర్చ ఉత్తరప్రదేశ్ నుంచి ప్రారంభమయ్యింది. ఉత్తరప్రదేశ్‌లో యోగికి, కేంద్రంలో మోదీ అమిత్ షాలకు మధ్య నడుస్తున్న రాజకీయ అమీతుమీలో తనపై చేయి నిరూపించుకోడానికి యోగి అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నారు.

ఉత్తరప్రదేశ్ యోగీ ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఉత్తరప్రదేశ్‌లో లవ్ జిహాద్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తామనే బిల్లు తీసుకువచ్చిందిప్పుడు. అసలు లవ్ జిహాద్ ఎక్కడుందనే ప్రశ్న చాలా మంది అడుగుతున్నప్పటికీ లవ్ జిహాద్ పేరుతో విద్వేష రాజకీయాలు నడపడమే లాభసాటిగా భావించేవారు ఇలాంటి విమర్శలను పట్టించుకోరు. బీజేపీ నేతలు ఈ బిల్లును సహజంగానే హర్షాతిరేకాలతో స్వాగతం పలికారు. సమాజవాది పార్టీ ఈ బిల్లును విభజనలు, విద్వేషాలు పెంచే బిల్లుగా పేర్కొంది. ఇప్పటికే ఉత్తరప్రదేశ్‌లో లవ్ జిహాద్ కు పదేళ్ళ జైలు శిక్ష వరకు విధించే చట్టం ఉంది. లవ్ జిహాద్ పేరుతో కొన్ని కేసులు కూడా నమోదయ్యాయి. కాని ఎంతమందికి శిక్షలు పడ్డాయో వివరాలు ఎక్కడా దొరకడం లేదు.

మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 తర్వాతి నుంచి అనేక సందర్భాల్లో లవ్ జిహాద్‌కు సంబంధించి తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని అధికారిక పత్రాల్లో తెలియ జేసింది. అంటే లవ్ జిహాద్ అనేది విద్వేష ప్రచారకుల బుర్రల్లో తప్ప మరెక్కడా లేదు. రేఖాశర్మ జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా ఉన్నప్పుడు అంటే 2020లో లవ్ జిహాద్ కేసులు పెరిగిపోతున్నాయంటూ ఒక వ్యాఖ్య చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు బీజేపీ నేతలు అప్పుడప్పుడు చేస్తూ ఉండడం వారి రాజకీయాల్లో పరిపాటే. కాని జాతీయ మహిళా సంఘం అధికారిక ప్రకటనల్లో తమ వద్ద అలాంటి డాటా ఏదీ లేదని చెప్పింది. అసలు చట్టం ప్రకారం లవ్ జిహాద్ అనేది నిర్వచించబడలేదని అప్పట్లో బీజేపీ చట్ట సభలోనే చెప్పింది. కాన్పూర్ లవ్ జిహాద్ కేసుగా మీడియాలో ప్రచారంలోకి వచ్చిన కేసులో అసలు కేసు ఏదీ లేదని తేలింది. ప్రేమ పెళ్ళిళ్ళపై లవ్ జిహాద్ ముద్ర వేసి కేసులు పెడుతున్నారనే ఆరోపణలు వచ్చాయి. నిజానికి లవ్ జిహాద్ అనేది మొదట కేరళ, కర్నాటకల్లో వినిపించింది. 2009లో కేరళలో కేథలిక్ బిషప్ కౌన్సిల్, హిందూ జనజాగృతి సమితి ఈ ప్రచారం మొదలు పెట్టాయి. ఆ తర్వాతి నుంచి లవ్ జిహాద్ పేరుతో రాజకీయాలు ముమ్మరమయ్యాయి. 2018లో కేరళలో హాదియా కేసు చాలా ప్రచారంలోకి వచ్చింది. కాని హాదియా స్వయంగా తాను ఇష్టపూర్వకంగా చేసుకున్న పెళ్ళి అని కోర్టుకు చెప్పారు. కోర్టు ఆదేశాలతో అప్పట్లో ఎన్ ఐ ఏ 11 కేసుల్లో విచారణ జరిపి ఎక్కడా ఎలాంటి లవ్ జిహాద్ కుట్రలు లేవని చెప్పింది. 2014లో అప్పటి హోం మంత్రి రాజ్ నాథ్ సింగ్ లవ్ జిహాద్ గురించి ప్రశ్నకు జవాబిస్తూ “లవ్ జిహాద్ అంటే ఏమిటి?” అని ఎదురు ప్రశ్నించారు. అయినప్పటికీ బీజేపీ పాలనలో ఉన్న రాష్ట్రాల్లో లవ్ జిహాద్ రాజకీయాలు, లవ్ జిహాద్ చట్టాల చర్చలు జరుగుతూనే ఉన్నాయి.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం లవ్ జిహాద్‌కు యావజ్జీవ కారాగార శిక్ష అంటూంటే ఇక్కడ తెలంగాణలో బీజేపీ లవ్ జిహాద్ చట్టం కావాలంటోంది. లవ్ జిహాద్ గురించి అధికారికంగా చెబుతున్న మాటలు వేరు, బీజేపీ నేతలు చెబుతున్న మాటలు వేరు. ఈ మాటలను గమనిస్తే దేశంలో మతవిద్వేషాలను రెచ్చగొట్టడానికి మాత్రమే లవ్ జిహాద్ ప్రచారం కొనసాగు తుందన్నది అర్ధమవుతుంది. కేరళ స్టోరీ వంటి ప్రాపగాండ సినిమాలతో ఈ ప్రచారాన్ని ఉధృతంగా కొనసాగిస్తున్నారు. ఇలాంటి సినిమాలకు బీజేపీ పూర్తి మద్దతు ఇస్తుంది. లవ్ జిహాద్ కేసులు ఎన్ని నమోదయ్యాయి? ఎన్ని కేసుల్లో శిక్షలు పడ్డాయి? లవ్ జిహాద్ కేసుల్లో అరెస్టవుతున్నవారిలో అత్యధిక శాతం మంది ఏ మతానికి చెందినవారు? వంటి ప్రశ్నలపై ఆలోచించేవారెవ్వరు? మతాల మధ్య చిచ్చురేపి రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవాలనుకునే వారి వల్ల దేశ ప్రయోజనాలకు ఎంత నష్టం వాటిల్లుతుందో పట్టించుకునే వారెవ్వరు?

 అబ్దుల్ వాహెద్



# పద్మవ్యూహం

**పార్లమెంటు కొత్త భవనంలో** సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సంచలనాత్మకంగానే కొనసాగుతున్నాయి. ఇప్పుడు చట్టసభలో ఏం జరుగుతుందని ఆలోచించగానే కనిపించే ముఖం రాహుల్ గాంధీ. కారణాలేమైనా గాని, బీజేపీ నాయకులు పప్పు... పప్పు అని అప్రతిష్ఠపాలు చేయడానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి చేసిన ప్రచారం వల్ల పైసా లాభం కలగలేదు. ఇప్పుడు రాహుల్ గాంధీ ముఖం లేని చట్టసభను ఊహించలేని పరిస్థితి వచ్చింది.

ఎన్నికల తర్వాతి నుంచి పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ప్రసంగాలు, బీజేపీ నేతల ప్రసంగాలు, బీజేపీ ప్రతిస్పందనలు, రాహుల్ ప్రతిస్పందనలు ఇవన్నీ మారిన రాజకీయ సమీకరణాలను సూచిస్తున్నాయి. రాహుల్ గాంధీ ప్రస్తావిస్తున్న సమస్యలు, వాటికి బీజేపీ ఇస్తున్న జవాబులు ఇవన్నీ ప్రజల్లో చర్చకు వస్తున్నాయి. ఇది రాజకీయంగా ఒక మంచి పరిణామంగానే భావించాలి. అయితే ఈ రాజకీయ పరిస్థితుల ప్రభావం ఎలా ఉంటుందన్నది ఆలోచించాలి.

రాహుల్ గాంధీ చక్రవ్యూహం గురించి, పద్మవ్యూహం గురించి, శివుడి గురించి ఎందుకు ప్రస్తావిస్తున్నారన్నది కూడా లోతుగా ఆలోచించవలసిన విషయం. రాహుల్ గాంధీ సాఫ్ట్ హిందుత్వ ధోరణిలో మాట్లాడుతున్నారని అనుకుంటే పొరబాటు. చాలా మంది ఈ పొరబాటు చేస్తున్నారు. కాని బీజేపీ అగ్రనేతలకు రాహుల్ వ్యూహం అర్థమవుతోంది. కాని ఎలా ప్రతిస్పందించాలో తెలియని అయోమయం వారిలో కనిపిస్తుంది. రాహుల్ గాంధీ తన ప్రసంగాల్లో హిందూ ప్రతీకలను ఉపయోగించడం వెనుక ఉన్న రాజకీయ వ్యూహం ఇప్పుడు బీజేపీకి మింగుడుపడడం లేదు. రాహుల్ గాంధీ హిందూ ప్రతీకలను తన ప్రసంగాల్లో ఉపయోగించడానికి కారణం సాఫ్ట్ హిందుత్వ కాదు. ఇది అంతకన్నా పెద్ద బ్రహ్మాస్త్రం. బీజేపీ రాజకీయ పునాదులను పెకలించే రణవ్యూహం దీని వెనుక ఉంది.

ఇప్పుడు పార్లమెంటులో ప్రతిపక్షాలకు, పాలకపక్షానికి మధ్య పోరు ఉధృతస్థాయిలోనే జరుగుతుంది. బీజేపీ నాయకుడు అనురాగ్ ఠాకూర్ లోక్ సభలో రాహుల్ గాంధీపై అనుచితంగా

చేసిన వ్యాఖ్యలు చూద్దాం. నిజం చెప్పాలంటే రాహుల్ గాంధీని దూషించాడనే చెప్పాలి. తన కులమేమిటో తెలియని వ్యక్తి కులగణన గురించి మాట్లాడుతున్నాడని అనురాగ్ ఠాకూర్ చేసిన వ్యాఖ్య అత్యంత హీనమైన వ్యాఖ్య. ఢిల్లీ అల్లర్లలో గోలీమారో (తుపాకితో కాల్చండి) అన్న నినాదాలిచ్చిన నాయకుడే ఈ అనురాగ్ ఠాకూర్. పార్లమెంటులో ఈ నేత రాహుల్ గాంధీపై చేసిన వ్యాఖ్యలు బజారు భాష స్థాయిలో ఉంది.

ఇక్కడ గమనించవలసిన రెండు విషయాలున్నాయి. అనురాగ్ ఠాకూర్ స్వయంగా ఈ వ్యాఖ్యలు చేశాడనుకుంటే పొరబాటు. ప్రధాని మోడికి తెలియకుండా, ఆయన ఆమోదం లేకుండా ప్రతిపక్ష నేతపై ఇలాంటి భాష ఉపయోగించే సాహసం ఆయన చేయలేడు. కాబట్టి ఇది బీజేపీ ఒక రణవ్యూహంగా ఆలోచించి తీసుకున్న నిర్ణయం ప్రకారం చేసిన వ్యాఖ్య. అందువల్లనే ఈ వ్యాఖ్యను ప్రధాని మోడీ స్వయంగా ట్వీట్ చేసి గొప్ప ప్రసంగం అని మెచ్చుకున్నారు.

రాహుల్ గాంధీని పప్పు అని ప్రచారం చేయడం వెనుక కూడా ఇలాంటి రాజకీయ వ్యూహమే ఉంది. అది తిరగబడిందిప్పుడు. అలాగే రాహుల్ గాంధీని బాలబుద్ధి అని ఎగతాళి చేయడంలో కూడా ఇలాంటి వ్యూహమే ఉంది. కాని అది కూడా బెడిసి కొట్టింది. రాహుల్ గాంధీని బాలబుద్ధి అని ఎగతాళి చేస్తే ప్రధాని మోడీని కాంగ్రెస్ నేతలు బైల్ బుద్ధి (బైల్ అంటే తెలుగులో ఎద్దు అని అర్థం) అని ఎగతాళి చేస్తూ ఆయన చెప్పిన అనేక మాటలను వైరల్ చేశారు. ఇప్పుడు అనురాగ్ ఠాకూర్‌తో చేయించిన ఈ దాడి కూడా ఒక వ్యూహంలో భాగంగానే బీజేపీ చేసింది. నిజం చెప్పాలంటే ఇప్పుడు బీజేపీ రాహుల్ గాంధీని అడ్డుకోడానికి ఏం చేయాలో తెలియని అయోమయంలో అనేకానేక ఎత్తుగడలు ప్రయోగించి చూస్తోంది. అందులో భాగంగానే ఈ వ్యాఖ్యలను చూడాలి. రాహుల్ గాంధీ అంటే బీజేపీకి పడదు కాబట్టి బీజేపీ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారా? అంటే ... కాదు... రాహుల్ గాంధీ అంటే చికాకు, పడకపోవడం, ఆగ్రహం ఇవన్నీ రాజకీయ వ్యూహాల్లో ఉండవు. ప్రజల్లో ఒక సందేశాన్ని ఇవ్వడం, ఒక నెరెటివ్ సృష్టించడం రాజకీయాల్లో ముఖ్యం. ఇప్పుడు బీజేపీ ప్రయత్నిస్తున్న నెరెటివ్ ఏమిటనేది ఆలోచిస్తే ... ప్రస్తుతం రాహుల్ గాంధీ చాలా పెద్ద నాయకుడిగా ప్రజల్లో పేరు వచ్చింది. ప్రతిపక్ష నేత అయ్యారు. కాని రాహుల్ గాంధీ ఎంత పెద్ద నాయకుడైనా బీజేపీలో చోటా నాయకుడు కూడా రాహుల్ గాంధీని అవమానించగలడని, రాహుల్ స్థాయికి అంతకు మించి కాదనే ఒక సందేశాన్ని ప్రజలకివ్వడమే ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అసలు వ్యూహం. ఈ వ్యూహం ఫలిస్తుందా బెడిసికొడుతుందా అన్నది కాంగ్రెస్ ఎలా ప్రతిస్పందిస్తుందన్న విషయంపై ఆధారపడి ఉంటుంది.

మరో వైపు రాహుల్ గాంధీ బీజేపీని ఊపిరాడనివ్వడం లేదు. బడ్జెట్‌పై మాట్లాడుతూ పద్మవ్యూహం గురించి చెప్పారు. పద్మ మంటే కమలం పువ్వంటూ బీజేపీతో లంకె కలిపారు. మహా భారతంలో కౌరవ సైన్యంలోని ఆరుగురు కలిసి పద్మవ్యూహంలో అభిమన్యుడిని చంపారని ఒక ప్రతీకగా ఉపయోగిస్తూ భారత దేశంలో బడుగు బలహీన వర్గాలపై బీజేపీ పార్టీ పద్మవ్యూహం అమలు చేస్తుందన్నారు. పద్మవ్యూహంలో అభిమన్యుడిని చంపిన వారెవ్వరో చెప్పారు. ఆధునిక పద్మవ్యూహంలో ఈ ఆరుగురు ఎవరో కూడా వివరించేశారు. సభలో హంగామా జరిగింది. బీజేపీ పద్మవ్యూహంలో దేశంలోని బడుగు బలహీన వర్గాలను నిర్వీర్యం చేసేస్తుందని రాహుల్ గాంధీ చెప్పారు కాని వాస్తవానికి రాహుల్ గాంధీ ప్రసంగాల పద్మవ్యూహంలో బీజేపీ ఇరుక్కుపోయి కనిపిస్తోంది.

బీజేపీలో అంతా బాగుందన్నట్లు చూపించడానికి ఉత్తరప్రదేశ్‌లో యోగీ, మౌర్యలు కలిసిపోయినట్లు సమావేశాల వార్తలు వచ్చాయి. ఉత్తరప్రదేశ్‌లో నిజానికి బీజేపీ చెల్లాచెదురైపోయింది. ఎన్నికల ఫలితాల్లో తగిలిన దెబ్బ బీజేపీ నేతలకు మింగుడు పడడం లేదు. ఉత్తరప్రదేశ్ అని మాత్రమే కాదు యావత్తు భారతదేశంలో బీజేపీ ఏ రాజకీయాలు చేయాలన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. 2014లో అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు బీజేపీకి అవకాశమిచ్చారు. 2019లో ఉగ్రదాడుల తర్వాత బలమైన నాయకుడిగా మోడీకి అవకాశమిచ్చారు. కాని 2024లో ఇవేవీ పనిచేయలేదు. అవినీతి విషయంలో బీజేపీ ట్రాక్ రికార్డు ఇప్పుడు గొప్పగా చెప్పుకునేదిగా లేదు. వాషింగ్ మెషిన్ అనే ఎగతాళి మాటలు బలంగా వినిపించాయి. బీజేపీ హార్డ్ కోర్ హిందుత్వ రాజకీయాలు నడపడానికి ప్రయత్నించింది. కాని ఎన్నికల ఫలితాల్లో ఆ రాజకీయాలు ఫలించలేదు. సామాజిక న్యాయం, బడుగుల పునరుద్ధరణ, వెనుకబడిన వర్గాల హక్కుల గురించి మాట్లాడితే బీజేపీకి సంప్రదాయికంగా ఓటు వేస్తున్న ఓటు బ్యాంకు దూరమవుతుంది. ఎందుకంటే వెనుకబడిన వర్గాల హక్కులకు సంబంధించి, బడుగులకు సామాజిక న్యాయానికి సంబంధించిన రాజకీయాలు బలం పుంజుకుంటే

## నమ్మినా నమ్మకపోయినా ? 21

# నాగరిక మానవ సమాజం యుగాంతం

నమ్మినా, నమ్మకపోయినా సమాజంలో కొన్ని వర్గాలపై కొనసాగుతున్న అసత్య ప్రచారాలు, ద్వేషాగ్ని ఆత్మహత్యా సదృశమే.
మానవాళికి ప్రయోజనం చేకూర్చే నిర్మాణాత్మక విధి విధానం లేకపోతే ఏ వర్గానికీ ప్రయోజనం ఉండదు. పక్షపాతం, దురభిమానం, ద్వేషాగ్ని – వీటిని పెంచిపోషించడం వలన అవి మానవ సమాజాన్నే దహించివేస్తాయి. మానవ చరిత్రే దీనికి సజీవ సాక్ష్యం. మానవత్వానికి వ్యతిరేకంగా కొన సాగిన, కొనసాగుతున్న ఈ విధ్వంసక వైఖరి నాగరికత పతనానికి దారితీస్తుంది.

దేశంలో హిందుత్వ రాజకీయాలు బలహీనమైపోతాయి. ఇది బీజేపీకి కోలుకోలేని దెబ్బ అవుతుంది. రాహుల్ గాంధీ రాజకీయాలన్నీ సామాజిక న్యాయం చుట్టు తిరుగుతున్నాయి. ఇప్పుడు బీజేపీకి రెండే మార్గాలున్నాయి. ఒకటి హిందుత్వ రాజకీయాలకు ఇంకా గట్టిగా కట్టుబడడం రెండు సామాజిక న్యాయం బీజేపీ పరిభాషలో సోషల్ ఇంజనీరింగ్ రాజకీయాలు నడపడం. కాని ఇక్కడ ఒక సమస్య ఉంది. బీహారులో నితీష్ కుమార్ కులగణన చేయించాడు. ఈ కులగణన ఫలితాలు, ఉత్తరప్రదేశ్ లోక్ సభ ఎన్నికల ఫలితాలు గమనిస్తే ఈ దేశంలో అత్యధిక శాతం జనాభా వెనుకబడిన వర్గాలే అని స్పష్టంగా తెలుస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో యోగీని తప్పించి మరో వ్యక్తిని ప్రతిష్టించడానికి జరిగిన ప్రయత్నాల వెనుక ఈ లెక్కలే ఉన్నాయి. కాని బీజేపీ ఇప్పుడు వెనుకబడిన వర్గాలకు న్యాయం చేసేది మేమే అంటూ ముందుకు వచ్చినా ప్రజలను నమ్మించడం కష్టం.

రాహుల్ గాంధీ హఠాత్తుగా ఇప్పుడు సామాజిక న్యాయం అనే నినాదాన్ని అందుకోలేదు. రాహుల్ గాంధీ రాజకీయాలను గమనిస్తే 2010 తర్వాతి నుంచి ఆయన సామాజిక న్యాయం గురించే మాట్లాడుతున్నాడు. కాని ప్రారంభంలో ఆయన ఫిలాసఫికల్‌గా చెప్పే మాటలు ఎవరికి అర్థమయ్యేవి కావు. పైగా బీజేపీ ఉధృతంగా కొనసాగించిన రాహుల్ వ్యతిరేక ప్రచారంలో ఆయన ప్రతిష్ట కొట్టుకుపోయింది. కాని ఇప్పుడు రాహుల్ గాంధీ తన రాజకీయాలు చాలా బలంగా నడుపుతున్నాడు. కులగణన చేయించాలన్న డిమాండ్ చాలా బలంగా ముందుకు తీసుకు వచ్చాడు. ఇది బీజేపీకి మింగుడుపడడం లేదు. రాహుల్ గాంధీ రాజకీయాలు ఈ ఎన్నికల్లో బీజేపీని చావుదెబ్బ తీశాయి. ఇప్పుడు పార్లమెంటులో ఎడతెగకుండా ప్రభుత్వంపై రాహుల్ చేస్తున్న దాడులు కూడా బీజేపీకి ఊపిరాడనివ్వడం లేదు.

ఈ మొత్తం వ్యవహారంలో ఆలోచించవలసిన మరో విషయం ఉంది. అదేమిటంటే, దేశంలో సామాజిక న్యాయం గురించి మాట్లాడిన వాళ్ళు, రాజకీయాలు నడిపిన వాళ్ళు, కాన్షీరాం కానీ, విపిసింగ్ కాని, శరద్ యాదవ్, రాంవిలాస్ పాశ్వాన్ వంటి నాయకులు సాధారణంగా తమ ప్రసంగాల్లో హిందూమత సూత్రాలపై దాడులు చేసేవారు. మనుస్మృతిని విమర్శించడం వంటివి ప్రధానంగా ఉండేవి. సామాజిక న్యాయం గురించి మాట్లాడడమంటే హిందూ మత సూత్రాలను వ్యతిరేకించడంతో సమానమయ్యేది. ఈ నెరేటివ్ సమాజంలో స్థిరపడింది. ఈ నెరేటివే బీజేపీకి లాభించింది. వెనుకబడిన వర్గాలు కూడా హిందూ మతాన్నే అంటి పెట్టుకుని ఉన్నాయి కాబట్టి హిందూ మత విమర్శను బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుని వెనుక బడిన వర్గాలను కూడా తనవైపు తిప్పుకునే అవకాశం ఉండేది. వాజపేయి, అద్వానీలు నడిపిన రాజకీయాలివే. సామాజిక న్యాయం కోసం గొంతు విప్పేవారి ప్రసంగాలను హిందూ వ్యతిరేక ప్రసంగాలుగా ప్రచారం చేయడం వారికి కష్టమయ్యేది కాదు.

కాని రాహుల్ గాంధీ వ్యూహం ఇప్పుడు బీజేపీ ఛేదించలేని సంక్లిష్ట వ్యూహంగా మారింది. రాహుల్ స్వయంగా హిందూ మత ప్రతీకలను ఉపయోగిస్తున్నారు. శివుడి గురించి మాట్లాడుతున్నారు. శివకల్యాణంలో అందరూ సమానంగా పాలుపంచుకున్నారని చెబుతున్నారు. ఆయన్ను హిందు వ్యతిరేకిగా చెప్పడం సాధ్యపడదు. అలాంటి ప్రయత్నం బీజేపీ చేసింది. కాని అది బెడిసికొట్టింది. రాహుల్ గాంధీని ధర్మభ్రష్టుడిగా చెప్పడమూ కుదరదు, ఆయన హిందూ దేవీదేవతలకు వ్యతిరేకి అని చెప్పడమూ కుదరదు. ఈ మాటలు చెప్పి ప్రజలను నమ్మించడం చాలా కష్టం. ఎందుకంటే ఆయన ప్రసంగంలో వాడుతున్న భాష, ప్రతీకలు అన్నీ హిందూ ధార్మిక పరిధుల్లోనే ఉంటున్నాయి. అయితే ఆయన సాఫ్ట్ హిందుత్వ వైపు మొగ్గు చూపుతున్నాడని

చెప్పడం కూడా కుదరదు. ఎందుకంటే ఆయన కేవలం హిందూ మతం గురించే కాదు మిగిలిన మతాలన్నింటి గురించి చెబుతూ భయపడరాదని, భయపెట్టరాదని అన్నాడు.

రాహుల్ వ్యూహం ఇప్పుడు బీజేపీకి పద్మవ్యూహంగా మారింది. చాలా మంది రాజకీయ విశ్లేషకులు పార్లమెంటులో రాహుల్ గాంధీ "హిందువులని చెప్పుకునేవారు.... " అంటూ చేసిన వ్యాఖ్య తర్వాత రాహుల్ చాలా పెద్ద పొరబాటు చేశాడని, బీజేపీ చాలా బలంగా వున్న గోదాలోకి దూకాడని ఇక కాళ్ళు చేతులు విరగడం ఖాయమన్నారు. కాని అలా జరగలేదు. ఈ వ్యాఖ్యల తర్వాత రాహుల్ హిందూ వ్యతిరేకిగా ప్రచారం చేయడానికి బీజేపీ ప్రయత్నించింది కాని సోషల్ మీడియాలో రాహల్ చేసిన మొత్తం ప్రసంగం అందరి ముందుకు వచ్చింది. బీజేపీ నేతల అబద్ధాలు కూడా అందరూ అర్థం చేసుకున్నారు. పైగా మొత్తం హిందూ సమాజానికి మోడీ ప్రతినిధి కాదని సూటిగా చెప్పిన మాటలు కూడా అందరూ విన్నారు. రాహుల్ నడుపుతున్నవి కొత్త రాజకీయాలు. ఇంతకు ముందు కాంగ్రెస్‌లో పెద్ద పెద్ద అతిరథ, మహారథులుగా పేరుపడిన నాయకులు బీజేపీ హిందూత్వ రాజకీయాలంటే చాలా భయపడేవారు. హిందూ, హిందూమతం గురించి అస్సలేమీ మాట్లాడవద్దని రాహుల్ గాంధీకి కూడా సలహాలు ఇచ్చేవారు. ఈ సలహాలు, ఈ భయాలు కాంగ్రెసును చివరకు అంత్యదశకు చేరుకునేలా చేశాయి. హిందూత్వ రాజకీయాలు నడిపే హిందువులు వేరు, హిందూ మతాన్ని ఆచరించే హిందువులు వేరు. ఈ తేడాను రాహుల్ గాంధీ చక్కగా అర్థం చేసుకున్నారు. దీనికి ఒక చక్కని ఉదాహరణ. కాంవడ్ యాత్ర. కాంవడ్ యాత్ర చేస్తున్నవాళ్ళు ఎవరెవరిపైనో దాడులు చేస్తున్న అనేక వార్తలు పత్రికల్లో కనబడు తున్నాయి. కాని నిజానికి కాంవడ్ యాత్ర ఎప్పటి నుంచో జరుగుతోంది. ఎన్నడూ ఇలాంటి సంఘటనలు మన ముందుకు రాలేదు. ఇప్పుడెందుకు ఇలా జరుగుతుంది? ఈ ప్రశ్నకు సమా ధానం చాలా సులభం. కాంవడ్ యాత్రలో వెళ్ళేది వెనుకబడిన కులాల పేదలే ఎక్కువ మంది ఉంటారు. వాళ్ళు ఒక మతా చారంగా, భక్తిశ్రద్ధలతో చేసే యాత్ర ఇది. ఎన్నడూ ఎవరిపైనా దాడి చేసిన ఉదాహరణలు గతంలో లేవు. కాని ఈ కాంవడ్ యాత్రలో రాజకీయాలతో పాటు సంఘ విద్రోహ శక్తులు కూడా ఇప్పుడు వచ్చేయడంతో ఈ దాడుల వార్తలు వస్తున్నాయి. అంటే కాంవడ్ యాత్ర చేస్తున్న వారిలోను రెండు రకాల వాళ్ళున్నారు. భక్తి శ్రద్ధలతో యాత్ర చేసేవారు ఒక రకమైతే, దాడులు దౌర్జన్యాలకు పాల్పడేవారు మరో రకం. ఈ మరో రకం కాంవడ్ యాత్రలో రావడానికి కారణం రాజకీయాలు.

రాహుల్ గాంధీ లోక్‌సభ ప్రసంగాల్లోను ఇదే ధ్వనిస్తుంది. నిజమైన హిందువు అహింసావాది అని ఆయన చెప్పాడు. కాంవడ్ యాత్రలో శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో యాత్ర చేస్తున్నవారు, దాడుల దౌర్జన్యాలతో ఉత్పాతం సృష్టిస్తున్న వారిలో ఎవరు నిజమైన భక్తులో, ఎవరు కాదో తేల్చుకోవడం ఇప్పుడు కష్టం కాదు. ఈ తేడా ప్రజలు గుర్తించేలా చేస్తున్నాడు రాహుల్ గాంధీ. ఆయన మతానికి బయట ఉండి మాట్లాడ్డం లేదు. మతంలో ఉండి మాట్లాడితే తన ఓట్లు పోతాయేమో అని కూడా భయపడడం లేదు. చాలా స్పష్టంగా మతంలో ఉంటూ సామా జిక న్యాయం, చట్టబద్ధపాలన గురించి ప్రజలకు సందేశం అందిస్తున్నాడు. అందుకే ఆయన ప్రసంగాల్లో మహాభారత పాత్రలు, పద్మవ్యూహం, శివుడు మొదలైన ప్రతీకలు వస్తున్నాయి. ఇది బీజేపీకి ఛేదించలేని వ్యూహంగా మారింది. నిజం చెప్పాలంటే గతంలో సామాజిక న్యాయం గురించి పోరాడిన వాళ్ళు, మాట్లాడిన వాళ్ళు చాలా గుడ్డిగా పోరాడారు. కాని రాహుల్ గాంధీ సామాజిక న్యాయం పోరాటాన్ని తెలివిగా, ఒక రక్షక కవచం తొడుక్కుని, ప్రత్యర్థులు దెబ్బతీయలేని వ్యూహంతో నడుపుతున్నాడు. ఇది అసలైన పద్మవ్యూహం. ఇందులో బీజేపీ ఇరుక్కుంది.

ఇప్పుడు బీజేపీ ఏం చేయాలో తోచని అయోమయంలో ఉంది. ప్రజల్లో రాహల్ గాంధీ పరపతి పెరుగుతోంది. సోషల్ మీడియాలో ఎదురులేని నేతగా మారాడు. రాహుల్ గాంధీని దెబ్బతీయడానికి కొత్తగా బీజేపీ పన్నిన వ్యూహం ఆయన్ను అవమానించడం ద్వారా రాహుల్ ఎంత పెద్ద నాయకుడైనా సరే బీజేపీలోని చిన్నా చితక నాయకుడి కన్నా ఎక్కువ కాదనే సంకేతాలు ప్రజలకు ఇవ్వడం, దాంతో పాటు రాహుల్ గాంధీని మానసికంగా దెబ్బతీయడానికి ప్రయత్నించడం. కాని రాహుల్ గాంధీ ప్రతిస్పందన ఇప్పుడు బీజేపీని పద్మవ్యూహంలో మరింత ఇరుక్కునేలా చేసింది. అనురాగ్ ఠాకూర్ తనను అవమానించా డని, బడుగుల హక్కుల కోసం పోరాడుతున్నప్పుడు ఇలాంటి అవమానాలు ఎన్నైనా సహిస్తానని, ఎవరెన్ని తిట్టినా భరిస్తానని, సామాజిక న్యాయ పోరాటం ఆగదని, కులగణన జరిపి తీరుతామని ప్రకటించాడు. తనకు క్షమాపణలు అక్కర్లేదు పొమ్మన్నాడు. ఇక్కడ గమనించవలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. నీ కులమేమిటనే ప్రశ్న సాధారణంగా కింది కులాలను

అవమానించడానికి అడిగే ప్రశ్న. ఇలాంటి అవమానాలు ఎదుర్కొంటున్న క్రింది కులాల వారందరు కనెక్ట్ అయ్యేలా రాహుల్ గాంధీ ప్రతిస్పందన ఉంది. పైగా అసలు కులగణన జరిగితే దేశసమైక్యత దెబ్బతింటుందని చెప్పుకునే బీజేపీ నాయకుడు కులమేమిటో తెలియని వ్యక్తి అంటూ చేసిన వ్యాఖ్య గురించి ప్రజలు ఆలోచించకుండా ఉండడం సాధ్యం కాదు. బీజేపీ రాహుల్ గాంధీని మానసికంగా దెబ్బతీయడానికి, రాహుల్ గాంధీని కించపరచడం ద్వారా తమదే పై చేయి అని ప్రజలకు సంకేతమివ్వడానికి చేసిన ప్రయత్నం కూడా బెడిసి కొట్టినట్లే కనిపిస్తుంది.

బీజేపీ ఈ ప్రయత్నం చేయడం వెనుక నేపథ్యాన్ని కూడా మనం చూడాలి. రాహుల్ గాంధీ రైతు నాయకులను పార్లమెంటుకు ఆహ్వానించినప్పుడు, రైతులు పార్లమెంటులో ప్రవేశించకుండా అడ్డుకున్నారు. ఇది తెలిసి రాహుల్ గాంధీ తానే స్వయంగా వారిని పార్లమెంటు బయట కలుసుకోడానికి బయలుదేరాడు. పత్రికల వారితో మాట్లాడుతూ రైతులు కాబట్టి వారిని పార్లమెంటులో రాకుండా అడ్డుకుంటున్నారేమో అన్నాడు. ఈ మాటలు బీజేపీకి శరాఘాతాలు. ఎందుకంటే రైతు ఉద్యమంలో రైతులు ఢిల్లీకి రాకుండా అడ్డుకున్నది బీజేపీయే. అందువల్ల రైతులను బీజేపీ పార్లమెంటులోకి రాకుండా అడ్డుకుందన్న సంకేతం ప్రజల్లోకి వెళ్ళకుండా ఆపడానికి రైతులను వెంటనే పార్లమెంటులో రాహుల్ గాంధీని కలుసుకోడానికి ప్రవేశం ఇచ్చారు. ఇది కూడా రాహుల్ గాంధీకి పెద్ద విజయమైంది. రైతులను ఢిల్లీకి కూడా రాకుండా బీజేపీ అడ్డుకుంటే, రాహుల్ గాంధీ వారిని ఢిల్లీలోని పార్లమెంటుకు కూడా రానిచ్చాడన్న సంకేతం ప్రజల్లోకి వెళ్ళింది. ఈ సందర్భంగా రైతు నేతలు పత్రికల వారితో మాట్లాడ్డం, రాహుల్ గాంధీ మాట్లాడ్డం, పార్ల మెంటులో పాత్రికేయులు అక్కడ వివిధ నేతలతో మాట్లాడి వారి అభిప్రాయాలు తీసుకోవడం ఇవన్నీ బీజేపీకి చికాగ్గా మారాయి. రిపోర్టర్లపై పార్లమెంటులో కొన్ని ఆంక్షలు విధించారు. దీనిపై కూడా రాహుల్ గాంధీ గళమెత్తి పత్రికల వారిని పంజరంలో బంధించారని అన్నాడు. ఈ వ్యాఖ్యలు బీజేపీని ఇరుకున పెట్టాయి. పత్రికలవారిపై ఆంక్షలను ఎత్తివేయక తప్పలేదు. వరుసగా బీజేపీ ఎదురుదెబ్బలు తింటుంటే, వరుసగా రాహుల్ పైచేయిగా కొనసాగుతోంది. ప్రజల్లో ఈ అభిప్రాయం బలపడకుండా రాహుల్ గాంధిని తమ నాయకుడితో తిట్టించడం ద్వారా రాహుల్ పెద్ద నాయకుడేమీ కాదనే సంకేతం ప్రజల్లోకి పంపించడానికి ప్రయత్నించింది బీజేపీ.

బీజేపీకి మింగుడు పడని మరో విషయం రాహుల్ గాంధీ డీప్ స్టేట్ అంటూ సభలో మాట్లాడడం. దేశంలో ఆరుగురు కలిసి దేశాన్ని పద్మవ్యూహంలో ఇరికించేశారని చెప్పిన రాహుల్ గాంధీ అంతటితో ఆగలేదు. డీప్ స్టేట్ అని సూటిగా విమర్శించాడు. డీప్ స్టేట్ అంటే సరళమైన భాషలో ప్రభుత్వాన్ని కీలుబొమ్మగా నడిపించే కొందరు వ్యక్తులని అర్థం చేసుకోవచ్చు. ఈ డీప్ స్టేట్ ఎవరన్నది ఆయన చెప్పలేదు. కాని పద్మవ్యూహం అంటూ కొన్ని పేర్లను చెప్పాడు. రెండు రెళ్ళు నాలుగన్నది ప్రజలకు అర్థమైపోతుంది. చట్టసభలో డీప్ స్టేట్ అనే పదం వాడడం సాహసంతో కూడుకున్న విషయం. దీని పరిణామాలు రాహుల్ గాంధీకి తెలియవా?

పద్మవ్యూహంలో అభిమన్యుడిని హతమార్చిన ఆరుగురిలో ద్రోణాచార్యుడు ఒకరు. ద్రోణాచార్యుడంటే రాజవంశానికి చెందిన వారికి యుద్ధవిద్యలు నేర్పిన ఆచార్యుడు. రాజవంశానికి చెందని వనవాసి ఏకలవ్యుడు తన వద్ద యుద్ధవిద్యలు నేర్చుకుంటే సహించలేక బొటనవేలివ్వమని గురుదక్షిణ తీసుకున్న ఆచార్యుడు. రాహుల్ వాడుతున్న ప్రతీకలు ప్రజలకు చాలా లోతయిన సందేశాలిస్తున్నాయి. మతం పరిధుల్లో ఉంటూ ఆయన చేస్తున్న ఈ దాడి మతతత్వ రాజకీయాలకు గొడ్డలి పెట్టుగా మారుతుంది. పైగా డీప్ స్టేట్ గురించిన ప్రస్తావనతో పద్మవ్యూహంలోని మిగిలిన పాత్రల ప్రతీకలను ప్రజలు అర్థం చేసుకునే పూర్తి నేపథ్యం ఆయన ప్రసంగంలో ఉంది. ఈ ప్రసంగాల్లో లోతయిన రాజకీయ వ్యూహం ఉంది.

రాహుల్ గాంధీని పప్పు అని ప్రచారం చేసిన బీజేపీ నేతలకు ఇప్పుడు రాహుల్ గాంధీ ఎలాంటి నాయకుడో అర్థమవుతోంది. లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాతో రాహుల్ గాంధీ మాట్లాడుతున్న తీరు చూస్తే చాలు ఆయన చాకచక్యం అర్థమవుతుంది. అదానీ అంబానీల పేర్లు తీసుకోవద్దని స్పీకర్ చెబితే సరే సర్ ఏ వన్, ఏ 2 అంటానని చెప్పడం, పాత్రికేయులను 'బేచారే' అనవద్దని చెప్పినప్పుడు, సరే సర్ 'నాట్ బేచారే పాత్రికేయులు' అనడం, అంతకు ముందు ప్రధాని మోడీని ఉద్దేశించి మోడీ పూర్తి హిందూ సమాజానికి ప్రతినిధి కాదు అని తెగేసి చెప్పడం ఇవన్నీ సమయస్ఫూర్తికి ఉదాహరణలు. తన పూర్తి ప్రసంగంలో రాహుల్ అంబానీ, అదానీల పేర్లు అనేక రకాలుగా ప్రస్తావించినా స్పీకర్ ఆపలేకపోయారు.

పాత్రికేయులను గోదీ మీడియా అని విమర్శించిన రాహుల్ గాంధీయే రిపోర్టర్లకు పార్లమెంటు భవనంలో ఆంక్షల నుంచి తప్పించాడు. మధ్యతరగతి ప్రజలపై బడ్జెట్ వాయింపులను

స్పష్టంగా సభలో వినిపించాడు. ముఖ్యంగా కేపిటల్ గెయిన్ గురించి చెప్పిన మాటలు నిస్సందేహంగా మధ్యతరగతిని ఆకర్షించే మాటలు. బీజేపీ 2014కు ముందు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సభను అడ్డుకోడానికి ఉపయోగించిన ఎత్తుగడలకు మించి ఇప్పుడు రాహుల్ గాంధీ దుడుకుతనం చూపిస్తున్నాడు. ప్రతిపక్ష సభ్యులను అవసరమైతే వెల్ లోకి వెళ్ళమని స్వయంగా రాహుల్ గాంధీ చెప్పడం కూడా చూశాం. ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్ గాంధీని లైట్ గా తీసుకోవడం కుదరదన్న సంకేతాలు స్పష్టంగా బీజేపీకి తెలుస్తున్నాయి.

బీజేపీకి ఉన్న మరో సమస్య ఏమిటంటే, ఈ పదేళ్ళ కాలంలో ప్రతిపక్ష నాయకుడిగా ఎవరు లేరు. అందువల్ల ప్రతిపక్ష నాయకుడి హోదాలో సుదీర్ఘ ప్రసంగాలు ఎవరు చేయలేదు. వినే అలవాటు బీజేపీ నేతలకు లేదు. కాని ఇప్పుడు తప్పడం లేదు. స్పీకర్ సారు ఇంతకు ముందు గద్దించి ప్రతిపక్ష నేతలను కూర్చో బెట్టేసేవారు. ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలో బీజేపీ అగ్రనేతలకు తెలియదు. క్లుప్తంగా చెప్పాలంటే రాహుల్ గాంధీ పన్నిన పద్మవ్యూహంలో బీజేపీ ఇరుక్కుని అయోమయంలో పడిపోయింది.

రాహుల్ గాంధీ వీడియోలు కూడా బీజేపీకి ఇబ్బందికరంగా మారాయి. చెప్పులు కుట్టుకునే సాధారణ వ్యక్తి వద్దకు వెళ్ళి మాట్లాడ్డమే కాదు చెప్పులు ఎలా కుడతారో నేర్చుకోవడం, రైతులు, మహిళలు, విద్యార్థులు, కూలీలు, సాధారణ ప్రజలు అందరినీ తరతమ భేదం లేకుండా కలుసుకోవడం ఇవన్నీ ఫోటోల కోసం చేస్తున్న ప్రయత్నాలని విమర్శించినంత తేలిక కాదు ప్రజల్లో రాహుల్‌కు పెరుగుతున్న ఆదరణను కొట్టిపారేయడం. రాహుల్ గాంధీ సాధారణ ప్రజలతో కలగలిసిపోతున్నాడు. బీజేపీ నేతలెవ్వరు ఇలా సాధారణ ప్రజలతో కలగలిసి పోయిన ఉదాహరణ ఒక్కటి కూడా లేదు.

ఇలా ప్రజల్లో కలగలిసి పోతున్న నాయకుడు, నా కులం గురించి నన్నెంత తిడతారో తిట్టుకోండి, నేనీ అవమానాలను పట్టించుకోను, మీ క్షమాపణలు కూడా నాకు అవసరం లేదు. దేశంలో కులగణన జరిపించి తీరుతాను అని చెబితే ఈ సగటు ప్రజలు ఈ నాయకుడితో ఎంత కనెక్ట్ అవుతారో అంచనా వేయలేని స్థితిలో బీజేపీ లేదు. తన ఓటర్లకు రాహుల్ గాంధీ స్పష్టమైన సందేశం ఇచ్చేశాడు. బడుగు బలహీనవర్గాల కోసం కులగణన కోసం తాను తిట్లు తింటున్నానని, అవమానాలు భరిస్తున్నానన్న సందేశం ఆయన పంపేశాడు. ఇలాంటి సందేశాలతోనే మోదీ ఇంతవరకు ప్రజలను ఆకట్టుకుంటూ వచ్చారన్నది కూడా మనం గుర్తించాలి. ఇదే ఎత్తుగడ ఇప్పుడు రాహుల్ గాంధీ బీజేపీపై ప్రయోగించాడు.

రాహుల్ గాంధీ ప్రసంగాలు, రాష్ట్రపతి ప్రసంగంపై, బడ్జెటుపై చేసిన రెండు ప్రసంగాలు బీజేపీని క్లీన్ బౌల్డ్ చేశాయి. బీజేపీని అయోమయంలో పడేశాయి,.

★★★


సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

## ముఖ్య ఆశయాలు

- సమాజంలో ప్రజాస్వామ్య విలువలు సర్వసామాన్యం కావడానికి, మానవుల మధ్య సోదరభావం పెంపొందడానికి, అంటరానితనం, నిమ్నోన్నతలూ, భేదభావాలు సమసిపోవడానికి, సాంఘిక న్యాయం నెలకొనడానికి ప్రజాచైతన్యాన్ని మేల్కొల్పడం.
- ముస్లిములు ముస్లిమేతరుల మధ్య సదవగాహన, సామరస్యం ఏర్పరచే వారధిని సృష్టించడం.
- ఇస్లాం, ముస్లింలు, ఇస్లామీయ ఉద్యమం గురించి ఏర్పడి ఉన్న అపార్థాలను, అపోహలను తొలగించటం.
- ఇస్లాం యొక్క నిజమైన బోధనల్ని ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా ప్రజలందరికీ తెలియజేయడం.


'చరితార్థులు'-2



# బేగం ఆమిన తయ్యబ్జీ

**(1866-1942)**

**56**






**9440241727**

బ్రిటిష్ పాలనను, దోపిడీని ఎదిరించిన భారతీయుల చరిత్రలో ప్రజల సమైక్యతే ప్రత్యేక లక్షణమని నిరూపించడం ధ్యేయంగా భారత స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న ముస్లిం అమర వీరుల గురించి చరిత్రకారుడు, బహుగ్రంథకర్త **సయ్యిద్ నశీర్ అహమ్మద్** రూపొందించిన ఆల్బమ్ **'చరితార్థులు' - 2 (తెలుగు)** THE IMMORTALS- 2 (ఇంగ్లీషు) నుండి గీటురాయి పాఠకుల కోసం ప్రత్యేకం

**బ్రిటిష్ వ్యతిరేక పోరాటాలలో** భాగంగా సాగిన సంస్కరణోద్యమాలలో కూడా చురుగ్గా పాల్గొని ఆ కార్యక్రమాలలో నిబద్ధతతో పాటుగా ఎంతో కార్యదక్షతను ప్రదర్శించిన మహిళలలో బేగం ఆమిన తయ్యబ్జీ ఒకరు. ఆమె గుజరాత్‌కు చెందిన ప్రసిద్ధ తయ్యబ్జీల కుటుంబంలో 1866 మే 15న జన్మించారు. జాతీయ కాంగ్రెస్ నాయకులు జస్టిస్ బద్రుద్దీన్ తయ్యబ్జీ ఆమె తండ్రికాగా జస్టిస్ అబ్బాస్ తయ్యబ్జీని ఆమె వివాహం చేసుకున్నారు. ఆ కుటుంబంలో ఉన్న రాజకీయ వాతావరణం మూలంగా ఆమె తన చిన్ననాటి నుండే స్వాతంత్ర్యోద్యమం పట్ల ఆకర్షితురాలయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ సభ్యురాలిగా ఆమె పలు కార్యక్రమాలలో భాగస్వామి అయ్యారు. 1930లో మద్యపాన నిషేధం, విదేశీ వస్తువుల బహిష్కరణ తదితర అంశాల మీద గుజరాత్ మహిళల సమావేశాలలో మహాత్మాగాంధీ ఆహ్వానం మేరకు ఆమె పాల్గొన్నారు. మహాత్ముడి సమక్షంలో జరిగిన ఆ సమావేశంలో గుజరాత్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఆమె ఎంపికయ్యారు. ఆ సమావేశం నిర్ణయాల మేరకు గుజరాత్ మహిళా కాంగ్రెస్ నేతగా ఆమిన తయ్యబ్జీ ఎన్నో కష్టనష్టాల కోర్చి మద్యపాన నిషేధం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమాలకు ప్రాణం పోశారు. గుజరాత్ అంతటా ధర్నా, పికెటింగ్, రాస్తారోకో లాంటి ఆందోళనా రూపాలతో ఉద్యమించి భారతదేశం మొత్తానికి గుజరాత్‌ను మార్గదర్శకంగా, ఆదర్శప్రాయంగా నిలిపారు. విదేశీ దుస్తులకు ప్రత్యామ్నాయంగా ఖద్దరు వస్త్రధారణను ప్రోత్సహించారు. రాట్నం తిప్పటం, నూలు వడకటం, ఖద్దరు నేయటం చివరకు ఖద్దరు ధరించడాన్ని స్వయంగా ఆచరించి ఆయా కార్యక్రమాలకు గుజరాత్ అంతటా బహుళ ప్రాచుర్యం కల్పించారు. ఆమె సేవానిరతిని 'యంగ్ ఇండియా', 'నవజీవన్' పత్రికలలో గాంధీజీ ప్రశంసించారు. ఈ ఉద్యమ నేపథ్యంలో మహిళా కాంగ్రెస్ పక్షాన 24 మంది మహిళల సంతకాలతో వైశ్రాయికి పంపిన లేఖలో అమిన తయ్యబ్జీ సంతకాన్ని కూడా గాంధీజీ స్వయంగా కోరడం ద్వారా జాతీయ స్థాయిలో ఆమె ప్రాధాన్యత వెల్లడయ్యింది. ఆ లేఖలో ఆమిన ఖురేషి, రెహాన తయ్యబ్జీలు కూడా సంతకాలు చేశారు. చివరి వరకు జాతీయోద్యమంలో మహాత్ముని అడుగుజాడల్లో ఆమె నడిచారు. జాతీయోద్యమంలో పలు బాధ్యతలు స్వీకరించి ఆయా కార్యక్రమాలన్నిటినీ ఎంతో దీక్షాదక్షతలతో నిర్వహించి జాతీయోద్యమంలో మహిళలతోపాటుగా పురుషులకు కూడా ఆదర్శంగా నిలచిన బేగం ఆమిన తయ్యబ్జీ 1942లో కన్నుమూశారు.

★

అధ్యాయం -16

41

## 1. జ్ఞాన ఖని!

# దేవుని బెబ్బులి!!

ఎస్.ఎమ్. మలిక్

### అసదుల్లాహ్ అలీ!!!

"నా ఆప్త బంధువుల్లారా! నా వంశీయుల్లారా!! హాషిమీ సహోదరులారా!!! నేను ఈవేళ మీ సమక్షంలో ఇహపరాల అత్యంత ఉత్తమ వర ప్రసాదాన్ని అందజేస్తున్నాను. మీరంతా ఏకోన్ముఖులయి ఒకే దేవుని ధర్మం పైన స్థిర పడండి. ఒకే దేవుని ధర్మ సంస్థాపనలో నాకు సహాయ పడండి. ఇక చెప్పండి, ఎవరెవరు నాకు చేదోడు వాదోడుగా నిలుస్తారో"- ఇలా అనేక పర్యాయాలు ఘోషించారు ప్రవక్తశ్రీ(స).

ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) దైవ దౌత్య భారాన్ని స్వీకరించిన తరువాత, మొదట గోప్యంగా తన దైవ దౌత్య సందేశాన్ని అందజేశారు. ఆ పైన దైవాదేశం మేరకు తన వంశంలోని ఆప్త బంధువులకు తన ఇంట భోజనం ఏర్పాటు చేసి భోజనాల పిదప దైవ సందేశాన్ని వినిపించదలిచారు. కాని అబూ లహబ్ ప్రవక్తశ్రీ(స)కి సందేశం వినిపించే అవకాశం ఇవ్వకుండా అడ్డుకున్నాడు. ఆ విందు ఏర్పాటు చేసిన వారు మహనీయ అలీ(ర).

మరుసటి రోజు కూడా మహనీయ అలీ(ర) అటువంటి విందు ఏర్పాటు చేశారు. ఆ రోజు కూడా అబూ లహబ్ అలాగే అడ్డుకున్నాడు. మూడవ రోజు కూడా అదేవిధంగా విందు ఏర్పాటయింది. ఈ సారి ప్రవక్త మహనీయులు(స) పైన క్లుప్తంగా పేర్కొన్న దైవ సందేశాన్ని వినిపించారు. దాన్ని మూడు సార్లు రెట్టించారు కూడా. ప్రతి సారీ ఓ చిన్న స్వరం, 'నేను సిద్ధం' అని వినిపించేది, కాని వ్యక్తి కానరాలేదు.

మూడవ మారు ఆ శబ్దం వినిపించిన మూల నుంచి ఓ బాలుడు లేచి నిలబడ్డాడు, ఇలా పలక సాగాడు, "నేనిప్పుడు చిన్న వాణ్ణి, నాకు కళ్ళు వచ్చి బాధ పడుతున్నాను, నా కాళ్ళు పలచగా, బలహీనంగా ఉన్నాయి. అయినా నేను మీకు తోడ్పడుతాను, మీతో సహకరిస్తాను, మీకు చేదోడు వాదోడుగా ఉంటాను, మీకు బలిమి నిస్తాను" అన్నాడు.

మాటిమాటికీ తన పక్షాన సమ్మతిని వెలిబుచ్చినా పట్టించుకోక పోతే బహుశా తాను చిన్నవాడని, బలహీనుడని భావించి ఎవరూ ఆసక్తి చూపడం లేదని అనుకొని, తన సమాధానంలో తన సంకల్పాన్ని సర్వం కూడగట్టి పొందుపరిచాడు ఆ బాలుడు. జవాబు కోరిన దైవ సందేశహరులు(స) దైవికంగా జ్ఞాన సంపన్నులు కావటాన అతని మనోగతాన్ని గ్రహించారు. అతని చెయ్యిని తన సమ్మతి సూచనగా తన చేతిలో తీసుకుని పట్టుకున్నారు. కాని హాషిమీ కుటుంబీకుల యోధాను యోధులు, యువకులు ఆ ఎనిమిది

తొమ్మిదేళ్ళ బాలుని సమక్షంలో చిత్తు చిత్తుగా పడిపోయారు. వారంతా నిశ్చేష్టులయి నిల్చుండి పోయారు.

ప్రవక్త ప్రశ్నకు అనుకూలంగా స్పందించిన ఆ బాలుడు అబూ తాలిబ్ సుతుడు!

ప్రవక్త ఇంట పెంపకంతోపాటు సుశిక్షణ పొందుతన్న ప్రవక్తశ్రీ పెత్తండ్రి కుమారుడు!!

బాలురలో ప్రప్రథమంగా ఇస్లామ్ స్వీకరించిన గుణ సంపన్నుడు అలీ, ధీశాలి, అలీ బెబ్బులి!!!

## ప్రవక్త ఇంట అలీ పెంపకం

దైవ దౌత్యానికి బహుశా మూడేళ్ళ క్రితం మక్కాలోనూ దాని చుట్టుపక్కల్లోనూ క్షామం వ్యాపించింది. ప్రవక్తశ్రీ(స)కి తనను పెంచిన పెత్తండ్రి అబూ తాలిబ్, ఆయన ఆర్థిక పరిస్థితి, అధిక సంతానం, గుర్తుకు వచ్చి ఏదయినా చేయాలని మరో పెత్తండ్రి మహనీయ అబ్బాస్‌ని సంప్రదించారు. ఆయన సమక్షంలో ఓ ప్రతిపాదన పెట్టారు, అబ్బాస్ దాన్ని ఆమోదించగా ఇద్దరూ అబూ తాలిబ్ ని కలిసి అంతా నివేదించారు. ఆయన అనుమతితో అబ్బాస్, జాఫర్‌నీ, ప్రవక్తశ్రీ అలీని తీసుకున్నారు. అప్పుడు అలీ వయస్సు 4,5 సంవత్సరాలు. ప్రవక్తశ్రీ(స), మహనీయ ఖదీజా ఇరువురూ ఆయన్ని మరీ మక్కువతో తమ సహచర్యంలో శిక్షణలో తమ సంతానంగానే పెంచి పెద్ద చేశారు.

## వింతయిన న్యాయం!

ఎంతగా నచ్చచెప్పినా బెదిరించినా, అబూ తాలిబ్ ద్వారా భయపెట్టినా తన సత్య ధర్మ ప్రచార కార్యక్రమాన్ని ఆపని ప్రవక్తశ్రీ(స) పట్ల విసుగు చెందిన మక్కా నాయకులు కడకు ఓ కొత్త ప్రతిపాదనతో అబూ తాలిబ్ వద్దకు వచ్చారు,

"ఓ హాషిమీ నాయకుడా! ఇదో, ఇతను ఖురైషీల ఎన్న దగ్గ, ఆరోగ్యవంతుడయిన, అంగ సౌష్టవం గల అందమయిన యువకుడు. ఇతన్ని మేము సంతోషంగా మీకు అప్ప చెబుతున్నాము. ఇతన్ని మీ స్వంత కొడుకుగా చేసుకోండి, ఇతని ద్వారా మీ పనులన్నీ చేయించుకోండి. అయితే బదులుగా దివంగతుడయిన అబ్దుల్లా తనయుణ్ణి మాకు అప్పజెప్పండి. మేము అతనికి తగిన బుద్ధి చెబుతాము. మీకు తెలుసు, అతను మన పూర్వీకుల ధర్మాన్ని వ్యతిరేకిస్తున్నాడు. ఖురైషీల కుటుంబాల్లో వేర్పాటు బీజాలు నాటాడు. అనేక మందిని ధర్మ భ్రష్టులుగా మార్చి వేశాడు. తన జాతి ఎంత నచ్చ చెప్పినా సన్మార్గాన రావడం లేదు" అని విన్నవించుకున్నారు.

దానికి అబు తాలిబ్ చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు,

"భలే న్యాయమండీ మీది, నేనేమో మీ సంతానాన్ని నా కుమారునిగా పెంచుకోవాలి, మరి మీరేమో నేను పెంచి పెద్ద చేసుకున్న నా కుమారుణ్ణి తమకు అప్పగిస్తే, అతన్ని మీరు చంపివేస్తారు, వారెవ్వా, ఇది చాలా బాగుంది!" అన్నారు వెటకారంగా.

## ఇస్లామ్ స్వీకారం

ఓనాడు ఆయన ఇంటికి వచ్చినప్పుడు గమనించారు, దైవ ప్రవక్త, ఖదీజా నమాజ్ చేసుకుంటున్నారు. ఆ పైన అలీ ప్రవక్తను అడిగారు, "మీరు చేస్తున్నది ఏమిటీ" అని. ఆయన (స), "ఇది దైవం ఆమోదం పొందిన ధర్మం ప్రకారం ఆరాధనా విధానం. దైవం ఈ ధర్మం పాటించాలని తన సందేశ హరుల ద్వారా మానవాళికి తెలిపాడు. నేను నీకు ఒకే దేవుని వైపునకు పిలుస్తున్నాను. ఆయన్నే ఆరాధించాలి, ఆయన్ని తప్ప అన్నింటినీ తిరస్కరించాలి."

దానికి అలీ, "మీరు లోగడ ఎన్నడూ చెప్పని విషయం చెబుతున్నారు, నేను మా నాన్న గారిని అడగనంత వరకు ఏ నిర్ణయమూ చేయ లేను" అని సమాధానం ఇచ్చారు. ప్రవక్త మహనీయులకు తన దైవ దౌత్య విషయం ఇంటి బయటికి వెళ్ళడం ఇష్టపడలేదు. అందువల్ల అలీని ఈ విషయం మరెవరికీ చెప్పవద్దని గట్టిగా చెప్పారు. అలీ అలాగే ఊరకున్నారు. అయితే దైవం ఆయన అంతర్యంలో సత్యాన్ని ఆవిష్కరించాడు. మరుసటి రోజు ఉదయం ప్రవక్త వద్దకు వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. ఇంకా ప్రవక్తశ్రీ కోరినట్లు కొంత కాలం దాన్ని మరుగున ఉంచారు కూడా.

## కొత్త ఆరాధనా విధానం

ఒక రోజు ఓ లోయలో ప్రవక్త మహనీయులు(స), మహనీయ అలీ(ర)తో కలసి నమాజ్ చేసుకుంటున్నారు, అటుగా వెళ్ళుతున్న అబూ తాలిబ్ ఇది గమనించారు.

"ఏమిటిదీ?"ఆయన అడిగారు.

"దేవుని ఆరాధన, దీన్ని మేము సలాత్ (నమాజ్) అని అంటాము" అన్నారు ప్రవక్తశ్రీ(స).

ఆయన దానికి అయిష్టతా వ్యక్తం చేయలేదు, మరి దాన్ని వారించనూ లేదు. అంటే అలీ నాన్న గారు మక్కావాసుల

దౌర్జన్య కాండం మొత్తాన,తన సోదర సుతుణ్ణి, మహనీయ ముహమ్మద్(స)ను కాపాడటానికి బహుధా సకల ప్రయత్నాలూ చేశారు, తన చివరి శ్వాస వరకు ఆయనకు వెన్నుదన్నుగానే నిలిచారు. అదేవిధంగా మహనీయ అలీ కూడా ప్రవక్తశ్రీ(స)కు తోడు నీడగా, ప్రచార కార్యకలాపాల్లో సదా, ఎల్లెడలా ఆయన వెంటనే ఉన్నారు. ఫలితంగా మహనీయ అలీలో అత్యున్నత ధార్మిక దూరదృష్టి ఏర్పడి, దైవంతో బాంధవ్యం పటిష్టతరమయింది.

## సందేశ ప్రచారం

మక్కాలో ప్రవక్తశ్రీ దైవ దౌత్య ప్రకటన తరువాత కొంత కాలానికి అరేబియా భూభాగం అంతటా ఇస్లామ్‌కు సంబంధించిన వివరాలు ప్రాకిపోయాయి. మదీనా నుండి బద్ర్ మైదానం వరకు వెళ్ళే దారిలో గిఫార్ తెగ నివసించేది. అబూ జర్ గిఫారీ ఈ సందేశం గురించి విని తన సోదరుని మక్కా నగరానికి పంపారు, ప్రవక్త గురించి సమాచారం సేకరించడానికి. అతను అందజేసిన రిపోర్టుతో తృప్తి చెందక తాను స్వయంగానే మక్కా వచ్చారు అబూ జర్. మక్కాలో ఎవరిని ప్రవక్తను గురించి అడగాలో బోధపడలేదు. పగలంతా కాబా ప్రాంగణంలో గడిపి రాత్రి అక్కడే మేను వాల్చారు.

మహనీయ అలీ(ర) ఈ కొత్త వ్యక్తిని గమనించి అడిగారు, ఎవరూ అని. నేనో బాటసారిని అని పలికారు అబూజర్. అలీ(ర) ఆయన్ని తన ఇంటికి ఆహ్వానించి ఆయనకు ఆతిథ్యం అందజేశారు. పడుకునేందుకు వీలు కల్పించారు. ఇదంతా ప్రవక్తశ్రీ ఇంట లభించిన సుశిక్షణ ఫలితం. ప్రవక్తను గురించి ఆయన అడగనూ లేదు ఈయన చెప్పనూ లేదు. మరుసటి రోజు అబూ జర్ తిరిగి కాబా గృహానికి వచ్చేశారు. రాత్రికి తిరిగి అక్కడే నడుం వాల్చుతారు. ఈ రోజు కూడా అలీ ఆయన్ని తన ఇంటికి తీసుకు వెళ్ళి అతిథి మర్యాద చేస్తారు.

అలాగే మూడవ రోజు కూడా గడిపిన తరువాత, ఇద్దరి మధ్య నమ్మకం కుదిరిన తరువాత అబూ జర్ అలీని తను వచ్చిన విషయం గురించి కదిలించారు. అవకాశం దొరికిన వెంటనే అలీ, ప్రవక్తశ్రీని గురించి అంతా క్షుణ్ణంగా చెబుతారు. తరువాత ఆయన్ని తన వెంట ప్రవక్త వద్దకు తీసుకు వెడతారు. అక్కడ అబూజర్ అన్ని వివరాలు తెలుసుకుని ఇస్లామ్ స్వీకరిస్తారు. ఆ పైన ప్రవక్తశ్రీ ఆయన్ని, తన తెగ వద్దకు వెళ్ళి ధర్మ ప్రచారం చేయవలసిందని కోరుతారు.

అబూ జర్(ర), సత్య ప్రకటన చేయకుండా ఎక్కడికీ వెళ్ళనని చెప్పి నేరుగా కాబా గృహం వెళ్ళి అక్కడున్న ఖురైషీలకు వినిపించడానికి బిగ్గరగా సద్వచనం, **"లా ఇలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదుర్రసూలుల్లాహ్"** పఠిస్తారు. అంతే ఆయన్ని తలా ఒక చెయ్యి వేసి బాగా బాది వేస్తారు. ఆ సందర్భంలో ఆయన దెబ్బలు తింటూనే **'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అని బిగ్గరగా పలకడం మాత్రం మానుకోలేదు.

మదీనాలో క్రమంగా ముస్లిములు బాగా అధికమవసాగారు. అది సహజంగానే మక్కా వాసులకు కంటగింపుగా మారింది. మదీనాలోని ముస్లిములు వారితో కుమ్మక్కయి తమతో పోరుకు దిగుతారన్న ప్రమాదం పట్ల జాగరూకులయ్యారు. గాభరాపడి ఈ పరిస్థితిని ఎదుర్కొనేందుకు వారంతా 'దారున్నద్వ' అన్న సలహాస్థలిలో కిం కర్తవ్యం అనుకుంటూ సమావేశమయ్యారు. ఆ పెద్ద తలలన్నీ తమ తలలు బద్దలు కొట్టుకుని కడకు మానవ మహోపకారి(స)ని హతమార్చాలని పథకం రూపొందించుకున్నారు. ✤


### చందాదారులకు విజ్ఞప్తి

చాలామంది పాఠకులు తమ చందా సొమ్మును బ్యాంక్ ఆన్‌లైన్ ద్వారా చెల్లిస్తున్నారు. ఇలా చందా చెల్లించిన వారు తమ పూర్తి అడ్రసు, ఫోన్ నెంబరు లేదా సెల్ నెంబరుతో సహా ఉత్తరం ద్వారా గానీ లేదా ఫోన్ ద్వారా గానీ తెలియజేయాలని మనవి.

వివరాలకు ఈ నెంబరుకు ఫోన్ చేయండి అబ్దుల్ జలీల్: 9704317015

ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపినవారు ఈ నెంబరుకు **Screen Shot** పంపి **9989903850** ఫోన్ చేయండి.

**Geeturai Weekly**
**Account No:1042789768**
Bank: **Central Bank of India**
Noorkhan Bazar Branch,
**IFSC Code. CBIN0282407**
**Hyderabad- 500 002, Telangana**

Office Address: **Geeturai Weekly**
**Sandesha Bhavanam, Lakkadkot, Chatta Bazar**
**Hyderabad-02. Email:geeturaiweekly@gmail.com**

# తెలుగు సాహిత్యంలో ఇస్లాంవాదాన్ని ఆవిష్కరించిన
# కరీముల్లా

- యండి. ఉస్మాన్ ఖాన్,

ఆధునిక తెలుగు సాహితీ చరిత్రలో అస్తిత్వవాద సాహిత్యాలదే అగ్రపీఠం. ఏ సమూహానికి ఆ సమూహం తమ హక్కుల కోసం గొంతెత్తుతున్న కాలంలో కవి కరీముల్లా తన జాతి జనుల హక్కుల కోసం, వారు ఎదుర్కొంటున్న వివక్షకు వ్యతిరేకంగా తన కలం ద్వారా, గళం ద్వారా యుద్ధం ప్రకటించాడు. కవి కరీముల్లా తనదైన శైలిలో ఇస్లాం ధర్మాన్ని తాత్విక పునాదిగా చేసుకొని ఇస్లాం వాదాన్ని ఆవిష్కరించాడు. ఇస్లాంవాదమని పేరు పెట్టినప్పటికీ పీడిత తాడిత దళిత బహుజనులందరూ తమ సోదరులేనని, పీడితులందరూ తన సంబోధితులేనని కరీముల్లా ప్రకటించాడు. తెలుగు సాహిత్యంలో తనదొక ప్రత్యేక స్వరంగా సామరస్య గీతాన్ని ఆలపిస్తున్నాడు. కరీముల్లా స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా వినుకొండ. గత మూడు దశాబ్దాలుగా నిరంతర సాహితీ సేద్యం చేస్తున్న కవి. తెలుగు సాహిత్యంలో ఇస్లాంవాద ఆవిష్కర్తగా, నూతన కవితా ప్రక్రియ 'అబాబీలు' రూపకర్తగా, ముస్లిం రచయితల సంఘం వ్యవస్థాపకునిగా ఎందరో కవులకు దిశానిర్దేశం చేసిన కవి. ముస్లిం అస్థిత్వ వేదనకు అక్షరమద్దుతూ ముస్లిం ఫోబియా, ఇస్లామోఫోబియాను దూరం చేసే కార్యభారాన్ని ఆయన కలం భుజానికెత్తుకుంది. ఎంతోమంది కవుల్ని ప్రోత్సహించి వెలుగులోకి తెచ్చి, అక్షరాలు దిద్దించిన ఆదర్శ గురువు, కరీముల్లా రూపొందించిన అబాబీలు అనే నూతన ప్రక్రియలో దాదాపు వందమందికి పైగా కవులు రాస్తూ ఉండటం మామూలు విషయం కాదు. కరీముల్లా ఇస్లామీయ సామ్యవాదాన్ని, సర్వమానవ సమతా భావాన్ని బలంగా విశ్వసించే కవి. ఇస్లాం ప్రేమ తత్వాన్ని హృదిలో నింపుకుని మతసామరస్యం, సోదరభావం, లౌకిక విలువల్ని ముందుకు తీసుకువెళుతున్న కవి. తెలుగు సాహిత్యంలో 'సాయిబు' అనే పేరుతో దీర్ఘ కవిత రాసి, దీర్ఘకవిత రాసిన తొలి ముస్లిం కవిగా ఖ్యాతి గడించారు. విప్లవ కవిత్వంలో మహాప్రస్థానానికి, దళిత కవిత్వంలో గబ్బిలానికి ఎంత ప్రాధాన్యత ఉందో మైనార్టీ కవిత్వంలో సాయిబు దీర్ఘ కవితకు అంత ప్రాముఖ్యత ఉందని సాహితీ విమర్శకుల అభిప్రాయం. దేశీయ మతతత్వ ఫాసిజంపై కరీముల్లా కలం ఎలా విరుచుకు పడిందో మచ్చుకు ఇది:

**'రేయ్ హిట్లర్ నవ్వకు**
**అలా పగలబడి, విరగబడి నవ్వకు**
**నా దేశంలో పునరుద్ధాన మొందిన నీ ఆత్మను చూసి నవ్వకు**
**ఖబరస్తాన్లో మా సమాధులపై మొలుస్తున్న వేరుచిగుర్లు**

రేపటి చరిత్రను నిర్మిస్తాయని తెల్సుకో' అంటూ గర్జించిన నిర్భయ కవి. ఇస్లాం శాంతిని బోధిస్తుంది అన్న యదార్థాన్ని చాటింపువేస్తూ తెలుగు కవిత్వంలో ఇస్లాంవాద జెండాను ఎగరేసిన యోధుడు. కరీముల్లా ఇప్పటివరకూ ఇరవై ఆరుకు పైగా పుస్తకాలు రాశారు. అందులోపదిహేను పుస్తకాలు ప్రచురితమయ్యాయి. అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు, అవార్డులు అందుకున్నారీయన. ఆయన కవిత్వంపై పలు విశ్వవిద్యాలయాలు పరిశోధనలు చేస్తున్నాయి. కరీముల్లా కవిత్వంపై పరిశోధన పూర్తి చేసిన ఏ. శ్రీనివాసరావుకు నాగార్జున విశ్వవిద్యాలయం పిహెచ్ డి ఇచ్చింది. తను రాసిన సాయిబు, బదర్ పుస్తకాలు ఆంగ్ల, కన్నడ భాషల్లో అనువాదమయ్యాయి. దేశవ్యాప్తంగా హిందీ, ఉర్దూ, కన్నడ, ఒరియా భాషల్లో అనేక కవితలు, విశ్లేషణలు వచ్చాయి.

**'మనుషుల్ని కదా**
**మన వాళ్లనుకోవాలి**
**వసంతాన్ని కదా**
**మనం కలకనాలి'**

అంటూ వసంత మేఘగర్జన చేస్తూ అన్ని రకాల మత తీవ్రవాదాలను కరీముల్లా కవిత్వం దునుమాడింది. అనునిత్యం పీడితుల పక్షం వహిస్తూ రాజ్యహింసను వ్యతిరేకించిన కలం కరీముల్లాది. ప్రసిద్ధ కవి శివసాగర్ మాటల్లో చెప్పాలంటే, ఈ దేశ కల్లోల సంద్రంలో కరీముల్లా కవిత్వం పోరాడే యుద్ధనౌక. అందర్నీ సమంగా చూడలేని కుహనా దేశభక్తి మీద 'థూ' అని ఉమ్మేసిన కవిత్వం. దేశ సమగ్రతకు భంగం కలిగించే శక్తులపై కవి కరీముల్లా కలం తుఫానులా విరుచుకుపడుతుంది. హిందువైనా, ముస్లిమైనా కన్నీ రొక్కటే, కష్టాలొక్కటే అని నినదించే కరీముల్లా కలం ఎందరికో ఆదర్శనీయం అంటే అతిశయోక్తి కాదు. కరీముల్లా భాయ్ ఇలానే ముందుకు సాగండి. ఆకాశమే హద్దుగా.. సుగుణాలే స్ఫూర్తిగా.!!


**(ఆదాబ్ హైదరాబాద్ సౌజన్యంతో...)**

బరువుల్ని ఎత్తుకోండి, భారంగా మారకండి

4

# ఒక్కొక్క రేణువే మేరువవుతుంది

# రండి, మీ వంతు సహకారం అందించండి




ముహియుద్దీన్ గాజీ

(గత సంచిక తరువాయి)

## వ్యక్తిత్వ ఆకర్షణ

ఆకర్షణ కల వ్యక్తుల ప్రజా సంబంధాల పరిధి చాలా విస్తృతంగా ఉంటుంది. తక్కువ ఆకర్షణ కల వ్యక్తుల సంబంధాల పరిధి తక్కువగానే ఉంటుంది.

ఆకర్షణను పెంపొందించుకునే కారకాలు అనేకం. వ్యక్తిలోని వృత్తి నైపుణ్యం, కళ కూడా ఒక ముఖ్యమైన కారకమే. తన వృత్తి నైపుణ్యాన్ని మనిషి సంఘ సేవ కొరకు వినియోగించు కోవటం కూడా ఒక ముఖ్య కారకమే. ఈ ప్రజ్ఞా పాటవాలన్నీ ఒక ఎత్తయితే, వీటిని ఒక ఉన్నత లక్ష్యంతో అనుసంధానం చేయటం ఒక్కటీ ఒక ఎత్తు.

## నిరాశ చెందరాదు, అవకాశాలను దొరకబుచ్చుకోవాలి

ఒక్కోసారి ఏం జరుగుతుందంటే, మనం సమాజంలో గొప్ప మార్పును తీసుకురావాలనుకుంటాం. కాని మనకు అచ్చి వచ్చిన వారు దొరకరు. వచ్చీరాని వారు మాత్రమే ఉంటారు. ప్రతిభా వంతులైన, నిస్వార్థ సేవాపరాయణులైన వ్యక్తుల భూమిక(Base) లభించాలని మనం ఎంతగానో కోరుకుంటాం. ఒక్కోసారి వ్యక్తుల ఆలోచనలు, అభిరుచులు మన లక్ష్యంతో సారూప్యత చెందవు. ఇలాంటి పరిస్థితిలో మనం నిస్పృహకు లోనవుతాము. ఎందు కంటే మన కార్యకలాపాల కొరకు మనకొక బేస్ అవసరమని మనం అనుకుంటాము.

వాస్తవమేమంటే ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు తమ సొసైటీలో ఉద్యమాన్ని నడపడానికి వ్యక్తులను స్వయంగా తయారు చేసుకోవలసి ఉంటుంది. దానికోసం వారు కఠోర పరిశ్రమకు సిద్ధంగా ఉండాలి.

ఉదాహరణకు: ప్రజలు ఉద్యమ సాహిత్యాన్ని చదివినప్పుడే వారిలో ఉద్యమ చైతన్యం వస్తుంది. వారు వీలయినంత ఎక్కు వగా ఉద్యమ సాహిత్యం అధ్యయనం చేసేలా వారిని ప్రోత్సహిం చాలి. ఒక పద్ధతి ప్రకారం వారికి సాహిత్య పుస్తకాలను సమ కూరుస్తూ ఉండాలి. ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థుల్లో, యువ కుల్లో, బాలబాలికల్లో ఈ పఠనాసక్తిని పెంపొందించేందుకు

నిరంతరం కృషి చేయాలి. ఇది ఓర్పుతో కూడిన సుదీర్ఘ ప్రక్రియే. కాని ఈ బాధ్యత గనక మీరు తీసుకున్నారంటే, మీరు సమాజంలో కీలకపాత్ర పోషించారన్నమాటే.

## గొప్ప సంప్రదాయం

ఇస్లామీయ ఉద్యమంలోని ఘనమైన ఆనవాయితీ ఏమిటంటే ఉద్యమ కార్యకర్తలు స్వయంగా ముందుకు వచ్చి పెద్దపెద్ద సామాజిక బాధ్యతలను తమపై మోపుకున్నారు. వయోజన విద్యా కేంద్రాలు నెలకొల్పారు. పిల్లల కోసం పాఠశాలలు, పూటబడులు స్థాపించారు. సంక్షేమ కార్యంలో భాగంగా ఆసుపత్రులను తెరిచారు. సద్భావనా మంచ్‌లను ఏర్పాటు చేశారు. షరయీ పంచాయతీల మొక్కల్ని నాటారు. మస్జిద్‌లలో దర్సె ఖుర్‌ఆన్ మండలాలను నెలకొల్పారు. తమ గ్రామాలలో, వీధులలో, వాడలలో ధార్మిక పుస్తకాల లైబ్రరీలను నడిపారు. విద్యావిషయిక చైతన్యాన్ని మేల్కొలిపే ఉద్యమాలు నడిపారు. వడ్డీ రహిత బ్యాంకులను నెలకొల్పారు. ఇవేవీ చేయలేకపోయినా ఒక అనాథ బాలుని స్పాన్సర్‌షిప్‌ను తీసుకుని అతన్ని మంచి విద్యావంతునిగా తీర్చిదిద్దారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో తోడ్పడ్డారు. మొత్తానికి తమ సమాజ శ్రేయో వికాసంలో వారు- ఉడుతా భక్తిగానైనాసరే- తమ వంతు పాత్రను చిత్తశుద్ధితో పోషించారు.

కొన్నాళ్ల క్రితం ఒక ఉద్యమ కార్యకర్తను కలుసుకోవటం జరిగింది. మాటల మధ్యలో ఆయన, కొన్నేండ్ల స్వల్ప కృషి ఫలితంగా సుమారు యాభై మందికి ఉపాధి కల్పించామనీ, ఇప్పుడు వారంతా జకాత్ చెల్లించగల స్థితికి చేరుకున్నారని చెప్పారు.

## ప్రతిభావంతులైన వ్యక్తుల మూడు లక్షణాలు

మూడు సద్గుణాలు గనక ఏ వ్యక్తిలోనయినా ఏకత్రమైనట్లయితే, అతడు సమాజంలో ఎంతో ప్రభావవంతమైన, ప్రయోజనకర మయిన వ్యక్తిగా రాణిస్తాడు. అవేమంటే- 1) సౌజన్యం 2) సామర్థ్యం 3) సంస్కరణా ప్రియత్వం.

'సౌజన్యం' (సాలీహియత్) అంటే సౌశీల్యం, ఉన్నత నైతికత, పవిత్రమైన వ్యక్తిత్వం కలిగి ఉండటం అన్నమాట. అతనిలో ఏవిధమైన కాపట్యంగానీ, ద్వంద్వ స్వభావం గానీ, స్వార్థ ప్రియత్వం గానీ ఉండకూడదు. సౌజన్యశీలం కారణంగా మనిషి సమాజంలో నిజాయితీ తత్పరత కలవాడుగా గుర్తించబడతాడు. జనులు అతన్ని నమ్ముతారు.

సామర్థ్యం (సలాహియత్) అంటే సమాజానికి లాభదాయకం కాగల ప్రతిభ, తెలివిడి, నేర్పరితనం కలిగి ఉండటం. ఏ వ్యక్తిలో ఈ ప్రతిభ ఉంటుందో అతడు సమాజం పాలిట ప్రయోజకుడుగా రాణించగలడు. అతడు తనలోని ఈ ప్రజ్ఞ మూలంగా సమాజంలో ఒక వ్యక్తిగా మాత్రమే ఉండడు. యావత్ సమాజంలో ఎంతో విలువైన మనిషిగా పరిగణించబడతాడు.

ఇకపోతే సంస్కరణ (ఇస్లాహియత్); ఇది మానవ వ్యక్తిత్వంలోని అత్యున్నతమైన కోణం. సంస్కరణా ప్రియుడైన మనిషి ప్రతి సమస్యకు ఉత్తమ పరిష్కారం కోరుకుంటాడు. అతడు ఎవరి నయినా కష్టాల్లో ఉండగా చూసి ఆనందించడు, అతన్ని ఆ గండం నుంచి గట్టెక్కించేందుకు తన వంతు చేయూత అందిస్తాడు. అతని దృష్టి సమస్యల్లోనే చిక్కుకుని ఉండదు. అది మరింత ముందుకుపోయి, సమస్యల చిక్కుముడులను విప్పటంపై దృష్టిని కేంద్రీకరిస్తుంది. అతడు చెడును చూసీ చూడ నట్లుగా వ్యవహరించడు, ఆ చెడును దూరం చేసేందుకు శాయ శక్తులా యత్నిస్తాడు. సంస్కరణా ప్రియత్వం మనిషికి సమాజంలో అసాధారణమైన 'స్వీకృతి'ని ప్రసాదిస్తుంది. జనులు తమ వ్యక్తిగత వ్యవహారాలు మొదలుకుని సామాజిక వ్యవహారాల వరకు- వాటి పరిష్కారం నిమిత్తం సంస్కర్తల వద్దకు వస్తుంటారు.

ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు మూర్తీభవించిన సౌజన్యంగా, ప్రతిభా సామర్థ్యాలను పుణికిపుచ్చుకున్న వారుగా, సంస్కరణా ధ్వజవాహకులుగా రాణించాలి. తత్ఫలితంగా వారి వ్యక్తిత్వానికి ఒక బరువు ఉంటుంది. వారి మాటకు విలువ ఇవ్వబడుతుంది. వారి అభిప్రాయం ఎన్నదగినదవుతుంది. సమాజంలో గొప్ప మార్పును తీసుకురాగోరే వారు ఈ సద్గుణాలతో శోభితులవ్వాలి. అప్పుడే వారు, **"భూమిలోని ఒనరులను నాకు అప్పగించండి. వాటిని నేను రక్షించగలను. అందుకు తగిన పరిజ్ఞానం నాకుంది"** (యూసుఫ్- 55) అని చెప్పగలిగే స్థాయికి చేరుకోగలరు. **"బలవంతుడూ, నమ్మకస్తుడూ అయినవాడే మీరు మీ సేవకునిగా నియమించుకోవటానికి అన్ని విధాలా ఉత్తముడు"** (అల్ ఖసస్- 26) అని సమాజంలోని జనులు మీ గురించి సాక్ష్యం ఇవ్వగలగాలి. మీరు సమాజానికి ఈ విధంగా నమ్మబలికే స్థాయికి ఎదగాలి : **"ఏ విషయాల నుండి నేను మిమ్మల్ని వారిస్తున్నానో వాటిని నేనే స్వయంగా చెయ్యటాన్ని నేను సుతరామూ ఇష్టపడను. నేను మాత్రం నా శక్తి మేరకు మిమ్మల్ని సంస్కరించదలిచాను."**

*(హూద్- 88)*

సమాజంతో దైవప్రవక్తలకు గల సంబంధం ప్రగాఢమైనదని ప్రవక్తల చరిత్ర చెబుతోంది. వారు సమాజానికి ఆదర్శప్రాయంగా ఉండేవారు. సమాజం పాలిట శ్రేయోభిలాషులుగా, సమాజం మొత్తానికి కేంద్ర బిందువుగా ఉండేవారు. ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలకు ప్రవక్తల చరిత్రలో అత్యుత్తమ ఆదర్శం ఉంది.

**(సమాప్తం)**

**"జిందగీ-యె-నౌ" సౌజన్యంతో**

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**

# 43. అజ్ జుఖ్రుఫ్

49 – 50 ప్రతి యాతన సందర్భంలోనూ వారు అనేవారు, "మంత్రగాడా, నీ ప్రభువు ద్వారా నీకు ప్రాప్తమయిన హోదానుబట్టి మా కొరకు నీవు ఆయన్ని వేడుకో, మేము తప్పక సన్మార్గాన్ని అవలంబిస్తాము" అని. కాని మేము వారి నుండి ఆ యాతనను తొలిగించగానే వారు తాము ఇచ్చిన మాటకు విముఖులయిపోయేవారు.[44]

**(44వ పాదసూచిక గత సంచిక తరువాయి)**

లేదా కప్పలు పెల్లుబికివచ్చేలా, లేదా మిడుతల దండ్లు వచ్చేస్తున్నట్లుగా భ్రమింపజేయగలడు. ఈ పరిమిత ప్రాంతంలోనూ నిజానికి నీరు ఎంతమాత్రం నెత్తురుగా మారదు. ఆ పరిధుల్ని దాటగానే నీరుగానే మిగిలిపోతుంది. కప్ప ఏదీ పుట్టదు, దాన్ని పట్టుకుని మీరు ఆ పరిధిని దాటిపోతే మీ చేతిలో కప్పకు బదులు గాలి మాత్రమే మిగులుతుంది. మిడతల దండు కూడా కేవలం భ్రమ మాత్రమే. అది ఏ చేనునూ తుడిచిపెట్టజాలదు. పోతే ఒక దేశం మొత్తాన కరవు ఏర్పడటం, లేదా దేశంలోని నదులూ కాలువలు, చెలమలు, బావులు అన్నీ రక్తంతో నిండిపోవడం, లేదా వేనవేల మైళ్ళ వైశాల్యంపైన మిడతల దండు విరుచుకు పడటం లక్షలాది ఎకరాల పొలాలు తుడిచిపెట్టుకుపోవడం, ఇదంతా ఏ మంత్రగాడూ నేటి వరకు చేయలేకపోయాడు, మంత్ర తంత్రాలతో ఇదంతా ఎన్నటికీ సాధ్యమూ కాదు. ఇటువంటి మంత్రగాళ్ళు రాజు దగ్గర ఉన్నట్లయితే అతను సేనలు నియమించుకోవడం దేనికీ, యుద్ధాలు చేయడమెందుకు, బాధలు భరించే అవసరమేముంది. ఈ మంత్రశక్తితోనే ప్రపంచమంతా అతను స్వాధీన పరచుకోగలడు. అంతేకాదు, మంత్రగాళ్ళ వద్ద ఆ బలముంటే వారు రాజుల వద్ద ఉద్యోగాలెందుకు చేస్తారు, స్వయంగా రాజులుగా రూపొందరా?

వ్యాఖ్యాతలకు ఒక ఇబ్బంది వచ్చి పడింది. దైవశిక్షను తప్పించుకోవడానికి ఫిర్‌ఔన్, అతని వందిమాగధులు హజ్రత్ మూసా (అ)ను ప్రార్థించమని అభ్యర్థించినప్పుడు ఆయన్ని 'మాంత్రికుడా' అని ఎలా సంబోధించగలరు. కష్టకాలంలో వేడుకునేవారు ముఖస్తుతికి దిగుతారు, ఖండనకు పూనుకోరు. ఈ కారణంగా వ్యాఖ్యాతలు దానికి ఈ విధమయిన అర్థాన్వయాన్ని సమకూర్చారు. ఆ కాలంలో మంత్రతంత్రాలు ఈజిప్ట్‌వాసుల మధ్య గౌరవనీయమయిన శాస్త్రంగా పరిగణించబడేది. అందువల్ల వారు 'మాంత్రికుడా' అని పిలిచి వాస్తవానికి హజ్రత్ మూసా (అ)ని ఖండించడం లేదు, తమ దృష్టిలో ఆయన్ని 'శాస్త్రవేత్తా' అని పిలుస్తున్నారన్న మాట. ఈ అర్థాన్వయం పూర్తిగా తప్పయినది. కారణం ఏమిటంటే, ఖుర్‌ఆన్‌లో, ఇతర స్థానాల్లో ఫిర్‌ఔన్, హజ్రత్ మూసాను సంబోధించి పలికిన మాటల్ని ఉటంకించినచోట పరిశీలిస్తే అతను ఆయన్ని మాంత్రికుడు అని, ఆయన చూపెట్టిన మహిమల్ని మంత్రతంత్రాలని పేర్కొన్నాడు. అక్కడ ఆ మాటల్లో ఖండనా భావం, కించపరిచే ధోరణి స్పష్టంగా గోచరిస్తోంది. అతని దృష్టిలో మంత్రజాలం ఒక బూటకపు విద్య అన్నది, అతను హజ్రత్ మూసా (అ)పై దాని నిందమోపి అతను ఆయన్ని బూటకపు దౌత్య ప్రకటనదారుగా పరిగణిస్తున్నాడని తేలిపోతుంది. అందువల్ల అకస్మాత్తుగా ఇక్కడ అతని దృష్టిలో మంత్రగాడు ఒక గౌరవప్రదమయిన బిరుదయి పోయిందన్నది నమ్మశక్యం కాని విషయం. పోతే, ప్రశ్న ఏమిటంటే, ప్రార్థన చేయాలని మనవి చేసుకునే టప్పుడు కూడా అతను బహిరంగంగా హజ్రత్ మూసా (అ)ను కించపరుస్తూ ఆయన పట్ల అవమానకరంగా ప్రవర్తిస్తూ ఉంటే ఆయన అతని అభ్యర్థనను అసలు స్వీకరించడమే ఎందుకు? దీనికి సమాధానం ఏమిటంటే, మహనీయ మూసా దృష్టిలో అల్లాహ్ ఆదేశం ప్రకారం వారికి వాదన పూర్తిచేయడం ముఖ్యం. శిక్షను తప్పించడానికి వారు ఆయన్ని ప్రార్థించమని అర్థించడం స్వయంగానే నిరూపించేదేమిటంటే వారు తమ ఆంతర్యాల్లో తెలుసుకున్నారు, ఈ శిక్షలు ఎందుకుపడుతున్నాయో, ఎక్కడి నుండి పడుతున్నాయో, ఎవరు దీన్ని తొలిగించగలరో. అయినప్పటికీ వారు మొండిగా ఆయన్ని మంత్రజాలికుడని అంటున్నారు. యాతన తొలిగిపోయిన తరువాత సన్మార్గాన్ని అవలంబించే వాగ్దానాన్ని త్రిప్పిగొడుతున్నారు. ఇలా చేసి వారు దైవప్రవక్తకు నష్టం కలిగించేదేమీ లేదు. కేసును తమకు వ్యతిరేకంగా మరింత బలోపేతం చేసుకుంటూ పోతున్నారన్నమాట. ఆ కేసు తీర్పు పరమ ప్రభువు వారి సంపూర్ణ వినాశం రూపేణ విధించిపెట్టాడు. వారు ఆయన్ని మాంత్రికుడు అని అనడం, వాస్తవంగానే వారు ఈ యాతనలు మంత్రబలంతో తమని ఆవహిస్తున్నట్లు, తమ ఆంతర్యాల్లోనూ ఇదే నమ్మేవారని అర్థం కాదు. నిజానికి వారి ఆంతర్యాల్లో వారికి బాగా ఎరుకే, ఇవి విశ్వప్రభువు సూచనలని, వారు వీటిని బాగా ఎరిగే తిరస్కరిస్తున్నారు. ఇదే విషయాన్ని నమ్ల్ సూరాలోనూ ప్రవచించడం జరిగింది. "వారు ఆసాంతం అన్యాయం, అత్యాచారం, అహంకారాలతో ఈ సూచనలను తిరస్కరించారు, నిజానికి వారి ఆంతర్యాలు అంగీకరించాయి." (అన్ నమ్ల్ : 14).

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

**ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)**
**తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్**

كِتَابُ الْمَغَازِي

## 4. యుద్ధాల ప్రకరణం

**(కితాబుల్ మగాజీ)**

### బద్ర్ యుద్ధ మైదానంలో ప్రవక్త (స) ప్రార్థన

**578)** ఇబ్నె అబ్బాస్(రజి) తెలిపారు : ప్రవక్త మహనీయులు (సఅసమ్) బద్ర్ యుద్ధ సందర్భంగా ఇలా అన్నారు: "అల్లాహ్! నేను నీ వాగ్దానాన్ని గుర్తు చేస్తూ వేడుకుంటున్నాను. (ఒకవేళ సత్య తిరస్కారులు ప్రాబల్యం వహించాలన్నదే) నీ అభిలాష అయివుంటే ఈ ధరిత్రిపై నీ ఆరాధన జరగదు"–ఇది వినగానే అబూబక్ర్ (రజి) దైవప్రవక్త(స) చేయి పట్టుకుని, 'దైవప్రవక్తా! ఇక చాలు' అన్నారు. ఆ తరువాత ప్రవక్త మహనీయులు(స) తన గుడారంలో నుంచి బయటికి వచ్చారు. ఆ క్షణంలో ఆయన నోట ఈ ఆయత్ వెలువడింది: "త్వరలోనే ఈ శత్రు వర్గం పరాజయం పాలవుతుంది."[1] *(54: 45)*

అధ్యాయం : 7

### ఖురైషు అవిశ్వాసులు, షైబా, ఉతబా, వలీద్, అబూ జహల్‌లను అధిక్షేపిస్తూ ప్రవక్త మహనీయులు(స) ప్రార్థించటం- వారి పరిణామం గురించి...[1]

**585)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం : ప్రవక్త మహనీయులు (సఅసమ్) కాబా గృహం వైపునకు అభిముఖమై ఖురైషు వర్గానికి చెందిన షైబా బిన్ రబీయ, ఉతబా బిన్ రబీయ, వలీద్ బిన్ ఉతబా, అబూ జహ్ల్ బిన్ హిషామ్ కొరకు ఆక్రందనతో కూడిన దుఆ చేశారు. నేను దైవసాక్షిగా చెబుతున్నాను, ఆ శాపగ్రస్తులందరి శవాలు బద్ర్ యుద్ధ మైదానంలో పడి ఉండటం నేను కళ్ళారా చూశాను. సూర్యుడు ఆ శవాలను కంపు కొట్టేలా చేశాడు. ఆ రోజు ఎండ చాలా తీవ్రంగా ఉంది."[1]

అధ్యాయం : 8

### అబూ జహ్ల్ వధ

**586)** అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(రజి) కథనం: బద్ర్ యుద్ధం జరిగిన దినాన ఆయన అబూ జహ్ల్ సమీపం నుండి సాగిపోయారు. ఆ సమయంలో అతడు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాడు. అతడు ఆయనగారితో, "నీవు చంపినవారిలో నాకన్నా గొప్పవాడు ఎవడయినా ఉన్నాడా?" అని అన్నాడు.

578-1. అల్లాహ్ తాను చేసిన వాగ్దానాన్ని అక్షరాలా నెరవేర్చాడు. బద్ర్ సంగ్రామం జరిగిన రోజున అల్లాహ్ మొదటి విడతగా వెయ్యి మంది దైవదూతలను పంపాడు. ఆ తరువాత ఈ సంఖ్యను మూడు వేలకు, అయిదు వేలకు పెంచి సహాయం చేశాడు.

దైవప్రవక్త(స) ఖురైషుల సైన్యాన్ని చూసినప్పుడు ఇలా వేడుకున్నారు: "దేవా! ఈ ఖురైషులు గర్వాతిశయంతో నీ ప్రవక్తతో పోరాడటానికి, అతన్ని అబద్ధీకరించడానికి వచ్చారు. దేవా! నీ సహాయాన్ని అందించి, మాకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చు."

7-1. మక్కాలో దైవప్రవక్త(స)ను వేధించడానికి దొరికిన ఏ అవకాశాన్నీ జారవిడువని దౌర్భాగ్యులు వారు. ఒకసారి దైవ ప్రవక్త(స) కాబా ప్రాంగణంలో నమాజ్ చేసుకుంటూ ఉండగా ఒంటె కసువును తెచ్చి ఆయన నడుంపై వేశారు. దైవప్రవక్త ఆక్రందనను దేవుడు ఆలకించాడు. బద్ర్ యుద్ధంలో వారంతా అంతమొందించబడ్డారు.

585-1. దైవప్రవక్త(స) సజ్దా స్థితిలో ఉన్నప్పుడు, ఆయన వీపుపై ఒంటె ప్రేగులు తెచ్చి పడవేసిన దుర్మార్గులకు జరిగిన శాస్తి ఇది. దైవప్రవక్త(స) వీపుపై బరువుతో లేవలేని స్థితిలో ఉంటే ఆ దుర్మార్గులు వికటాట్టహాసం చేస్తూ వేడుక చూశారు.

# భారతీయ సమాజంలో సత్య సందేశం

- ఎస్.ఎమ్.మలిక్

## భారతీయ సమాజం

మన దేశంలో మొత్తం జనాభా దాదాపు 130 కోట్లు. అందులో 80 కోట్ల జనాభా వెనుకబడ్డ తరగతుల ప్రజలు, గిరిజన ప్రజలదే. అలాగే దాదాపు 20 కోట్ల ప్రజలు ఉన్నత వర్గీయులనబడేవారు న్నారు. ఇంకా ముస్లిములు, ఇతర మతాలననుసరించేవారు 30 కోట్ల ప్రజలున్నారు.

ఇదొక మిశ్రమ (Plural) సమాజం. మతపరంగా హైందవులు, ముస్లిములు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, క్రైస్తవులూ ఉన్నారు. భాష రీత్యా అధికారికంగా 15 భాషలు గుర్తింపు పొందినవయితే అసంఖ్యాకమయిన మాండలికాలు (Dialects) ఉన్నాయి. సంస్కృతి (Culture) దృష్ట్యా మన దేశంలో ప్రతి వంద మైళ్ళకు సంస్కృతి మారిపోతుందని అంటారు. ఇంకా జాతుల (Ethnc, Race) రీత్యా మన దేశంలో ఆర్యులు, ద్రావిడులు, తురుష్కులు, మంగోలియన్లు, అరబ్బులు, పార్శీకులున్నారు.

## సామాజిక స్వరూపం

సర్వసాధారణంగా యువత మన దేశంలో పాప్ కల్చర్ (Pop Culture)కు గురయి ఉన్నారు. ఇందులో యువకులూ యువతుల స్వేచ్ఛాయుత కలయికలు, యూరోపియన్ లేదా అమెరికన్ విలాస వస్తువుల వినియోగం, పిజ్జా, బర్గర్, కోకా కోలాల వినియోగం, డిస్కో డాన్సులలో సాధారణ నిమగ్నత, ఇంటర్నెట్ ద్వారా, ఫేస్‌బుక్ ఇత్యాది ఉపకరణాల (Apps)లో పారవశ్యం ఇత్యాది వ్యాధులకు లోనయి ఉన్నారు.

ఒకప్పుడు ఫిల్ములకే పరిమితమయిన అశ్లీల చిత్రాలు, నేడు ఇంటర్నెట్, సోషల్‌మీడియా ద్వారా ఒక్కొక్క వ్యక్తి చేతుల్లోకి వచ్చేశాయి. ఫలితంగా సామాజిక స్వరూపమే మారిపోయింది. వ్యభిచారం, వేశ్యా వృత్తి, లూటీలు, హత్యలు నేడు సర్వసామాన్య మయి పోయాయి. ఇంత విశాలమైన దేశంలో రోజూ ఎక్కడో ఓ చోట కాదు, అనేకచోట్ల ఈ నేరాలు జరుగుతూ ఉండటం మామూలయిపోయింది.

ధన పిపాస మూలంగా తల్లిదండ్రులు సంతానాన్ని, సంతానం తల్లిదండ్రుల్ని, సోదర సోదరీలు, భార్యాభర్తలు పరస్పరం హతమార్చుకోవడం కనీవినీ ఎరుగము. కాని నేడు అలాంటి గాథలు కూడా విరివిగానే వినవస్తున్నాయి. బంధుత్వ సంబంధాల పవిత్రత ఏ మాత్రం మిగులలేదు. మతతత్వం బాగా పెచ్చరిల్లింది. మతతత్వ ఘర్షణలు బాగా పెరిగిపోయాయి. అదొక ఉగ్రవాదంగా తయారయింది. కుల, మత, వర్ణం, వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి.

విపణీ వీధిని చూస్తే మోసగించడం, వ్యాపార వంచనలు, వ్యాపార ప్రకటనల ద్వారా వినిమయ వస్తువుల విక్రయం విజృంభణ అతి సాధారణమయిపోయింది. లంచగొండితనం అన్నది పంచాయితీలు, మునిసిపాలిటీలు మొదలుకొని రాష్ట్రాల పాలనా వ్యవస్థ, కేంద్ర పాలనా వ్యవస్థల్లో సర్వాంతర్యామిలా దర్శనమి స్తుంది. గుండాయిజం, హత్యా రాజకీయాలు, వంచనాశిల్పం సయితం పంచాయతీలు మొదలుకొని పార్లమెంట్ వరకు రాజకీయాల్లో సర్వత్రా కానవస్తాయి.

ఆర్థిక వ్యవస్థను పరిశీలిస్తే ప్రపంచీకరణ (Globalization) ద్వారా అంతర్జాతీయ వాణిజ్య సంస్థలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు అన్నింటా అమెరికా సామ్రాజ్యవాదం పెత్తనం తప్ప మరేమీ కానరాదు. అన్నింటినీ మించి వడ్డీ వ్యవస్థ ద్వారా అటు వ్యక్తుల్నీ ఇటు జాతుల్నీ దోపిడీకి గురిచెయ్యడం జరుగుతోంది. ఫలితంగా లేమి, పేదరికం, నిరుద్యోగం ఎల్లెడలా తిష్టవేశాయి. శ్రీమంతుడ యితే శ్రీమంతునిగా పరిఢవిల్లుతున్నాడు. కాని నిరుపేద బీదరికాన్ని విడనాడలేకపోతున్నాడు.

## దైవ విరోధ సమాజం కాదు!

ఏది ఏమయినా భారతీయ సమాజం దైవ వ్యతిరేక, దైవ విరోధ సమాజం కాదు! అంటే విశ్వ స్రష్టను నమ్మే సమాజమే. దైవాన్ని ఆరాధించే సమాజమే దేవుడు కేవలం సృష్టి రూపకల్పనకు, దాన్ని నిరంతరం నడపడానికి అవసరమే. కాని మానవుని నిత్య జీవితంలో దైవానికి, దైవభావనకు, ఆరాధనలు తప్ప, మరి ఎందులోనూ స్థానం లేదు!!

## ముస్లిమ్ సముదాయం

ముస్లిమ్ సముదాయం పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది.

ఆర్థికంగా ముస్లిములు బాగా దిగజారిన స్థితిలో ఉన్నారు. సాధారణ విద్యలోనూ వెనుకబడిన జాతుల కన్నా మరీ హీనంగా తయారయ్యారు. రాజకీయంగా కూడా వారికి ఎటువంటి విలువ లేదు. వారి కుటుంబాలు, వారి సముదాయం సాధారణంగా ధార్మికంగానూ వెనుకబడే ఉన్నాయి. వారి కుటుంబాలు కూడా అనేక కౌటుంబిక సమస్యల్లో (Domestic, Family Disputes) చిక్కుకుని ఉన్నాయి. తలాక్, ఖులా, కుటుంబం బాగోగుల పట్ల అనాసక్తత ఇత్యాది సమస్యలు వారిని చుట్టుముట్టి ఉన్నాయి. నిజానికి వారు మిగతా సముదాయాల సమక్షంలో నిష్క్రియా పరులుగా, ఆచరణా శూన్యులుగా, జీవితం, ప్రపంచ వ్యవహారాల పట్ల నిరాశా నిస్పృహలకు, అచేతనావస్థకు గురయినట్లు అగుపడతారు. వారి సామూహిక జీవితంలో కూడా ప్రభావ శీలమయిన నాయకత్వం ప్రాప్తం కాలేదు. ఈ కారణాలన్నింటి మూలంగా తమ సాముదాయిక స్థానాన్ని, లక్ష్యాన్నీ నిర్లక్ష్యంగా వదలి వేశారు వారు.

దైవం వారికి కల్పించిన 'మధ్యస్థ సమాజ' స్థానానికి దూరంగా, 'శ్రేష్ఠ సముదాయం' స్థానానికి భిన్నంగా, తమ విధ్యుక్త బాధ్యత, ప్రజల సమక్షంలో సత్యానికి సాక్ష్యంగా నిలవడం పట్ల అశ్రద్ధకు లోనయి ఉన్నారు.

ఇదీ మొత్తానికి భారతదేశం, మనదేశం యథార్థ చిత్రం...

## సత్య సందేశం

సత్య సందేశం, లేదా దైవం ప్రసాదించిన జీవన మార్గబోధన, లేదా ఇస్లామ్ సందేశం మానవుని నిజమయిన ఆవశ్యకత. దాని ప్రకారం జీవించడమే మానవుని ఇహపరాల సాఫల్యానికి సోపానం. కాని ఒక విషయం గమనార్హం. భారతదేశంలోని మిశ్రమ సమాజంలో, పైన పేర్కొన్న విభిన్న రకాల చెడుగులు చోటు చేసుకున్న వైవిధ్యత గల సమాజంలో నైతికంగా, సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రోగాలకు గురయి బాగా ముదిరిపోయిన సమాజంలో ఇస్లామ్ సందేశం అనివార్యం (inevitable) అయి పోతుంది. అయితే ఇస్లామ్ సందేశం అంటే అదేమిటి? అదొక మత ప్రచారం లాంటిదా? కాదు, దాన్ని వివరంగా పరిశీలించ వలసి ఉంటుంది. ఇస్లామ్ ప్రకారం దాని సిద్ధాంతం, సందేశం ఏమిటో గమనిద్దాం.

## వ్యక్తి

ప్రతి వ్యక్తి వ్యక్తిగతంగా దైవ దాస్యాన్ని స్వీకరించాలి. ఇందులోనే అతని ప్రాపంచిక విజయం, పారలౌకిక సాఫల్యం ఇమిడి ఉన్నాయి. అందువల్లనే ఇస్లామ్ వ్యక్తినే, మనిషినే సంబోధిస్తుంది. మనిషి సమున్నతి, సౌభాగ్యాలే దాని లక్ష్యం. ఎందుకంటే దైవం సమక్షంలో వ్యక్తి మాత్రమే వ్యక్తిగత స్థాయిలో సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది (Answerable). వ్యక్తిగా ప్రతి మనిషి ప్రపంచంలో గడిపే జీవితం, ప్రభు దాస్యానికి ప్రతీకగా దైవ దాస్యానికి అద్దం పట్టేదిగా ఉండాలి. అప్పుడే పరలోకంలో అది సాఫల్యంలా ప్రతిఫలిస్తుంది. ఇస్లామ్ ఆచరణాత్మకంగా మనిషి లేదా వ్యక్తి సంస్కరణనే కాంక్షిస్తుంది. మానవుని ఆధ్యాత్మిక, నైతిక, పరిణామ ప్రగతుల్ని ఆశిస్తుంది. వ్యక్తి ప్రగతీ వికాసాలు (Individual Evolution) కొరకు దారి చూపుతుంది. అప్పుడే సరయిన సమాజ నిర్మాణం సవ్యంగా సాధ్యం అని అంటుంది.

## సమాజం

మనిషి వ్యక్తిగతంగా విజయవంతమయిన జీవితం గడపడానికి అతని వ్యక్తిగత కృషితోపాటు అటువంటి వ్యక్తుల సమాహారం ద్వారా ఏర్పడే సమాజం, దాని సామూహిక వాతావరణం దైవ దాస్యానికి అనువయినదిగా నిర్మాణమవ్వాలి. ఆ సమాజం పరలోక శ్రేయాన్ని కాంక్షించే సమాజం కాగలదు. అటువంటి సమాజం నిస్వార్థ, నిర్మోహ ప్రధానమయిన, సానుభూతి పరమయిన సమాజం మాత్రమే కాగలదు.

## రాజకీయ వ్యవస్థ

ఇటువంటి సమాజం నిర్మాణమవడానికి, నిర్మాణం జరిగిన తరువాత దాన్ని చిరస్థాయిగా సుస్థాపితం చేసి నిలుపడానికి ఇస్లామ్ ఓ ప్రత్యేకమయిన రాజకీయ వ్యవస్థను రూపొందించగోరుతుంది. ఆ వ్యవస్థ దైవధర్మాన్ని పూర్తిగా వ్యక్తి జీవితంలోను, సమాజం లోనూ, సకల జీవన రంగాల్లో అమలుపరిచేందుకు దోహద పడుతుంది. దానికి అవసరమయిన అవకాశాన్ని, వాతావరణాన్ని రూపొందిస్తుంది.

ఇస్లామ్, దాని సందేశాన్ని, దాని వ్యవస్థను ఈ ముప్పేట కృషి, ఈ త్రివిధ (Three fold) సంఘర్షణ ద్వారా అది కోరే పరివర్తనను వ్యక్తిలోనూ సమాజంలోనూ ఆవిష్కరించదలుస్తుంది.

ఒకటి, వ్యక్తి పరిణామ ప్రగతులు, సంస్కరణా కృషి.

రెండు, ఇస్లామీయ సమాజ నిర్మాణం.

మూడు, ఇస్లామీయ ప్రమాణాల (Values) ఆధారంగా రాజకీయ వ్యవస్థ రూపకల్పన. ఈ మూడు విధాల కృషి ఒకదానితో మరొకటి గట్టిగా ముడిపడి ఉన్నాయి.

**ఇదే ఇస్లామీయ సందేశం :**

ఇది ముస్లిమ్ సోదరుల సంస్కరణ, సంఘటనలతో మొదలవు తుంది. ఆ తరువాత సోదర దేశవాసులకు సత్యధర్మ సందేశాన్ని అందజేసే మార్గం ద్వారా కొనసాగుతుంది. ఇంకా సమాజంలో ధర్మసంస్థాపన వైపునకు పయనిస్తుంది!

**(ఇంకా వుంది)**



# తల్లిదండ్రుల సేవలోనే మన సుఖసంతోషాలు

- షేఖ్ అబ్దుల్ బాసిత్, కొత్తగూడెం

**అమ్మ-** నాన్నలో ఎవరు గొప్ప అని ఎవరైనా అడిగితే ఏం సమాధానం చెబుతారు?

"మనిషికి ఊపిరి ముఖ్యమా? శరీరం ముఖ్యమా?" అని అడిగితే ఏం సమాధానం చెబుతారు?.

నాన్న లేకుండా మన ఉనికి లేదు. అలాగే అమ్మ లేకుండా మనం లేము.

కాకపోతే మనం నిర్మాణంలో నాన్న పాత్ర కొన్ని కణాలది. కొన్ని క్షణాలది.

అమ్మ నవ మాసాలు మనల్ని తన గర్భంలో మోస్తుంది.

అమ్మ గర్భం నుంచి ఈ లోకానికి వచ్చి, మనం మన కాళ్ళ మీద నిలబడే వరకు అమ్మ పోషించిన పాత్ర, అమె త్యాగం వెలకట్టలేనిది. వర్ణించలేం కూడా.

అందుకే మన సేవకు నాన్న కన్నా అమ్మకు మూడు రెట్లు అధికంగా ప్రాధాన్యత ఇచ్చారు ప్రవక్త ముహమ్మద్(స).

ఇస్లాంలో తల్లి స్థానం గురించి గొప్ప మాటలున్నాయి.

1) అమ్మ మిమ్మల్ని తొమ్మిది నెలలు తన కడుపులో మోస్తుంది.

2) ప్రాణాలను సైతం పణంగా పెట్టిన మనల్ని ఈ లోకంలోకి తెస్తుంది.

3) రెండు సంవత్సరాలు తన రక్తాన్ని పాలుగా చేసి మనల్ని పెంచి పోషిస్తుంది .

"జీవితాంతం తల్లిని తన భుజాలపై వేసుకుని తిరిగి ఆమెకు సేవ చేసిన ఆమె ప్రవసవ వేదనలో అనుభవించిన చిన్న నొప్పి యొక్క ఋణాన్ని కూడా తీర్చుకోలేము" అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స)

"ప్రేమ వాత్సల్యంతో నగుమోముతో అమ్మ వైపు ఒకసారి చూస్తే ఒక హజ్ చేసిన పుణ్యం లభిస్తుంది" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్(స)

రెండు సార్లు చూస్తే అని సహచరులు అడుగగా, రెండు కాదు వందసార్లు చూస్తే వంద హజ్‌లు చేసిన పుణ్యం లభిస్తుంది అని తెలిపారు.

అంటే మనకు చిల్లిగవ్వ ఖర్చు చేయకుండా ప్రతి రోజూ హజ్ చేసి పుణ్యాలు మూట కట్టుకునే అవకాశం తల్లి ద్వారా లభిస్తుంది అన్నమాట.

అందుకే "తల్లి పాదాల చెంత స్వర్గం ఉంది" అన్నారు ప్రవక్త ముహమ్మద్(స)

అలా అని తండ్రి తక్కువ అని అర్థం కాదు.

ఆ స్వర్గంలో ప్రవేశించాలి అంటే తండ్రి అనే తలుపు తెరుచు కుంటేనే సాధ్యం అవుతుంది.

ఎందుకంటే ఆ స్వర్గానికి ప్రధాన ద్వారం అంటే తలుపు తండ్రియే కనుక.

ఒక సందర్భంలో "తల్లిదండ్రులే మీ స్వర్గం. తల్లిదండ్రులే మీ నరకం" అని అన్నారు ప్రవక్త ముహమ్మద్ (స).

అంటే మీ తల్లిదండ్రుల సేవలోనే స్వర్గం ఉంది. వారి నిరాదరణలోనే నరకం ఉంది అని అర్థం .

మానవాళి మార్గదర్శి మానవ జీవిత మర్మాన్ని వివరించి దైవాదేశాల ఖురాన్ గ్రంథంలోని సురే బనీ ఇస్రాయీల్‌లో ఇలా సెలవిచ్చాడు అల్లాహ్.

"నీ ప్రభువు ఇలా నిర్ణయం చేశాడు: మీరు కేవలం ఆయనను తప్ప మరెవరినీ ఆరాధించకండి. తల్లిదండ్రులతో మంచితనంతో వ్యవహరించండి. ఒకవేళ మీవద్ద వారిలో ఒకరు గాని ఇద్దరు గాని ముసలివారై ఉంటే, వారి ముందు విసుగ్గా "ఛీ" అని కూడా అనకండి. వారిని కసురుకుంటూ సమాధానం ఇవ్వకండి. వారితో మర్యాదగా మాట్లాడండి. మృదుత్వమూ, దయాభావమూ కలిగి వారి ముందు వినమ్రులై ఉండండి. ఇలా ప్రార్థిస్తూ ఉండండి: "ప్రభూ! వారిపై కరుణజూపు, బాల్యంలో వారు నన్ను కారుణ్యంతో, వాత్సల్యంతో పోషించినట్లు". (17:23-24)

ఇస్లాం స్త్రీ పురుషులకు సమాన హక్కులు కల్పించింది.

ఇస్లాంలో సమయాన్ని సందర్భాన్ని బట్టి ఒకరికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. అంటే అర్థం ఒకరు తక్కువ ఇంకోకరు ఎక్కువ అన్నది కానేకాదు.

కేవలం మన తల్లితండ్రులను మాత్రమే కాదు, ఇతరుల తల్లిదండ్రులను కూడా మన తల్లితండ్రులతో సమానంగా గౌరవించ మంటుంది.

ఒక సందర్భంలో ప్రవక్త ముహమ్మద్(స) "తల్లిదండ్రులను తిట్టే వారికి వినాశం తప్పదు" అని అన్నారు.

ఓ ప్రవక్త ముహమ్మద్ (స)! ఇతరుల తల్లిదండ్రులను తిట్టేవారు కూడా ఉంటారా? అని సహచరులు అడుగగా,

"మీరు ఇతరుల తల్లిదండ్రులను తిడితే, వారు తిరిగి మీ తల్లిదండ్రులను తిడుతారు కదా. అంటే పరోక్షంగా మీరు మీ తల్లిదండ్రులను తిట్టినట్లే కదా" అని అన్నారు.

అంటే మనం మన తల్లితండ్రులను ఎలా అయితే గౌరవిస్తామో అలాగే ఇతరుల తల్లిదండ్రులను కూడా గౌరవించాలి.

వాస్తవానికి మన ఆయువు, ఆరోగ్య, ఐశ్వర్యాల వృద్ధి తల్లిదండ్రుల దీవెనలలో ఉన్నాయి.

అది మరచి మనం ఎక్కడెక్కడో తిరుగుతుంటాం.

మన ఇహ పరాల సాఫల్యం జీవితం కోసం కాని పెంచిన కన్నవారికి సేవలు చేద్దాం. ఎలాగైతే వారు మనల్ని చిన్నతనంలో పోషించారో.

❖


యువతరానికి
విప్లవనాదం
చేతనవాదం

సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

ఒక వారం చదవండి
ప్రతి వారం చదువుతారు !

చందా వివరాలు

| | |
|---|---|
| విడిప్రతి | ₹ 15 |
| ఆరు మాసాల చందా | ₹ 375 |
| సాలుసరి చందా | ₹ 750 |

ఆన్‌లైన్ ద్వారా పైకం చెల్లించి గీటురాయి వారపత్రికను తెప్పించుకోవచ్చు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు
GEETURAI WEEKLY
Central Bank of India,
Noor Khan Bazar Branch, Hyderabad
A/c. No. 1042789768
IFSC Code. CBIN0282407

లేదా

పైకాన్ని యం.ఓ. లేక డి.డి. ద్వారా కూడా పంపవచ్చు. డి.డి ద్వారా పంపదలిస్తే డి.డి.ని 'Geeturai Weekly' పేర మాత్రమే తీయాలి.

GEETURAI WEEKLY
SANDESHA BHAVANAM, LAKKADKOT,
CHATTA BAZAR, HYDERABAD - 500 002.
Phone: 24564583, 24576237
E-mail: geeturaiweekly@gmail.com

# అల్లాహ్ నిషేధించిన విషయాలు ఏవి?

- సయ్యిద్ అబ్దుస్సలామ్ ఉమ్రీ

**అల్లాహ్ పరిశుద్ధ వస్తువులనే ధర్మసమ్మతం చేశాడు. అశుద్ధ వస్తువులనే నిషేధించాడు.**

ఏ వస్తువులలో మనకు మేలుందో అల్లాహ్ అలాంటి వస్తువులనే హలాల్ చేశాడు. ఏ వస్తువులలో మనకు కీడుందో అల్లాహ్ అలాంటి వస్తువులనే హరామ్ చేశాడు. అల్లాహ్ తన దాసులకు, ఇతర సృష్టిరాశులకు హాని కలిగించే వాటిని, నష్టం కలిగించే వాటిని ఎప్పటికీ ఇష్టపడడు.

ఏ విషయాన్ని చేయడం వల్ల, చేయకపోవడం వల్ల ఎలాంటి పాపం అనేది ముట్టదో దాన్ని హలాల్ అంటారు. ఇక హరామ్ అంటే, దానికి పాల్పడే వ్యక్తిని శిక్షించడం జరుగుతుంది. దానిని పరిత్యజించిన వ్యక్తికి - అతని ఆ పరిత్యాగం అనేది అల్లాహ్ నిషేధితానికి అనుగుణంగా ఉంటే పుణ్యం లభిస్తుంది.

నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని న్యాయంగా వ్యవహరించాలని, మేలు చేయాలని, బంధువుల పట్ల దయతో మెలగాలని ఆదేశిస్తున్నాడు. నీతి బాహ్యత, అశ్లీలం, దౌర్జన్యాల జోలికి పోకూడదని వారిస్తున్నాడు. మీరు విషయం గ్రహించడానికి దేవుడు మీకిలా ఉపదేశిస్తున్నాడు (అన్-నహ్ల్: 90)

హరామ్‌ను మూడు విధాలుగా విభజించవచ్చు.

- ➢ మాటలకు, చేతలకు, వ్యవహార శైలికి, ప్రవర్తనా నియమావళికి సంబంధించిన నిషేధితాలు.
- ➢ ఆహార పానీయాలు, మనిషి కడుపులోకెళ్లే ఇతర వస్తువులకు సంబంధించిన నిషేధితాలు.
- ➢ ధార్మిక వ్యవహారాలు, దాని చిహ్నాలకు సంబంధించిన నిషేధితాలు.

1) మాటలకు, చేతలకు, వ్యవహార శైలికి, ప్రవర్తనా నియమావళికి సంబంధించిన నిషేధితాలు.

రండి, అల్లాహ్ తన దాసుల కోసం వేటిని ఇష్టపడ్డాడో, వేటిని నిషేధించాడో, మాటల్లో చేతల్లో ఏవి అల్లాహ్‌కు ఇష్టమైనవో, ప్రవర్తనా నియమావళిలో ఏవి అల్లాహ్‌కు అయిష్టమైనవో- ఖుర్‌ఆన్ స్పష్టమైన వాక్యాల ద్వారా తెలుసుకుందాం!

నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని ఆదేశిస్తున్నాడు: ఎవరైనా మిమ్మల్ని నమ్మి ఏదైనా వస్తువుని మీ దగ్గర భద్రపరిస్తే తిరిగి వారికి సురక్షితంగా అప్పగించండి. ప్రజల మధ్య ఏదైనా వ్యవహారం తీర్చవలసి వస్తే న్యాయంగా తీర్చండి. చూడండి అల్లాహ్ మీకు ఎంత మంచి హితోపదేశం చేస్తున్నాడో! ఆయన సమస్తం వింటున్నాడు, చూస్తున్నాడు. (అన్-నిసా: 58)

నిశ్చయంగా అల్లాహ్ మిమ్మల్ని న్యాయంగా వ్యవహరించాలని, మేలు చేయాలని, బంధువుల పట్ల దయతో మెలగాలని ఆదేశిస్తున్నాడు. నీతిబాహ్యత, అశ్లీలం, దౌర్జన్యాల జోలికి పోకూడదని వారిస్తున్నాడు. (అన్ నహ్ల్: 90)

➢ ఈ ఆయతులో అల్లాహ్ మూడు విషయాలను చేయాలన్నాడు, మరో మూడు విషయాలను విడనాడమన్నాడు.

➢ న్యాయంగా వ్యవహరించాలని అల్లాహ్ ఉపదేశించాడు.

➢ మాటల్లో చేతల్లో ఉదారతను, ఉత్తమ విధానాన్ని కలిగి ఉండాలని అల్లాహ్ ఉపదేశించాడు. ఇక ఆరాధనలో ఇహ్సాన్ అంటే, మనం అల్లాహ్‌ను చూస్తున్నామన్నంత తన్మయానికి లోనయి ఆయన్ను ఆరాధించడం, లేదా ఆయన మనల్ని చూస్తున్నాడన్న భక్తీ, భయంతో ఆరాధించడం.

➢ బంధువుల పట్ల దయతో మెలగాలని, బంధుత్వ సంబంధాలను బలపర్చాలని, వారికి చేదోడువాదోడుగా ఉండాలని ఉపదేశించాడు.

➢ నీతి బాహ్యత, అశ్లీలం, దౌర్జన్యాల జోలికి పోకూడదని అల్లాహ్ వారించాడు.

➢ మనిషి అంతరంగం ఏవగించుకునే విషయాలను, హేతుబద్ధం కానీ విషయాల జోలికి పోకూడదు అని అల్లాహ్ వారించాడు.

➢ ప్రజల మీద అతిక్రమణను, అత్యాచారాన్నీ, పెత్తనాన్ని, హక్కుల స్వాహాను అల్లాహ్ నిషేధించాడు.

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(ర) గారి ఇలా సెలవిచ్చారు: నిశ్చయంగా ఈ ఆయతు ఇస్లాం ధర్మానికి సంపూర్ణ భాష్యం అని చెప్పవచ్చు.

హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్ఊన్(ర) గారి కథనం- నేను ప్రారంభంలో దైవ ప్రవక్త (స) వారి యెడల నాకు గల బిడియం కారణంగా నేను ఇస్లాం స్వీకరించాను. కానీ నిజంగా ఈ ఆయతు విన్న తర్వాత మనస్ఫూర్తిగా ఇస్లాం ధర్మాన్ని విశ్వసించాను. అది- "మీప్రభువు మీపై ఎలాంటి ఆంక్షలు విధించాడో తెలుపనా" అని వారికిలా చెప్పు:

- ఆయనకు ఎవరినీ సాటి కల్పించకూడదు.

- తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మసలుకోవాలి.

- దారిద్ర్య భయంతో మీ సంతానాన్ని (చేజేతులా) హతమార్చుకోకండి. మేము మీకూ ఆహారమిస్తున్నాము, వారికీ ఆహారమిస్తున్నాము.

- నీతిబాహ్యమైన పనుల దరిదాపులక్కూడా వెళ్ళకండి- రహస్యంగానైనా, బహిరంగంగానైనా సరే.

- న్యాయ ప్రాతిపదికపై తప్ప అల్లాహ్ నిషేధించిన ఏ ప్రాణినీ చంపకండి. మీరు అర్థంచేసుకొని మసలుకుంటారని అల్లాహ్ మీకీ విషయాలు బోధిస్తున్నాడు.

- అనాథ బాలలు యుక్త వయస్సుకు చేరుకోనంతవరకు సక్రమ పద్ధతి ద్వారా తప్ప వారి సొమ్ము సమీపానికి పోకండి.

- తూనికల్లో, కొలతల్లో పూర్తిగా న్యాయం పాటించండి. ప్రతి వ్యక్తిపై మేము అతను మోయగలిగినంత బాధ్యతాభారమే మోపుతాము.

- వ్యవహారం మీ బంధువులకు సంబంధించినదైనా సరే న్యాయంగా మాట్లాడండి.

- అల్లాహ్ విషయంలో మీరు చేసిన ప్రమాణాన్ని నిలబెట్టుకోండి. మీరు విషయాన్ని గుర్తుంచుకుంటారని అల్లాహ్ మీకిలా హితోపదేశం చేస్తున్నాడు.

- ఇదే తాను నిర్దేశించిన రుజుమార్గమని, మీరు ఈ మార్గానే నడవాలని ఆయన మీకు ఉపదేశిస్తున్నాడు. ఇతరులు చూపే మార్గాలు అనుసరించకూడదని, అలా అనుసరిస్తే వారు ఆయన మార్గం నుండి మిమ్మల్ని తప్పిస్తారని నచ్చజెప్తున్నాడు.

మీరు చెడుల జోలికి పోకుండా భయభక్తులతో మసలుకుంటారని దేవుడు ఈ విధంగా మీకు హితోపదేశం చేస్తున్నాడు. (అల్-అన్ఆమ్: 151-153)

(లుఖ్మాన్ తన కుమారునికి ఇలా ఉపదేశించారు:) "కుమారా! నీవు -

- ప్రార్థనా (నమాజ్) వ్యవస్థను నెలకొల్పు.

- (ప్రజలను) మంచిని గురించి ఆదేశించు, చెడు విషయాలనుండి వారించు.

- కష్టాలు వచ్చినప్పుడు సహనం వహించు. ఇవి ఎంతో ధైర్య సాహసాలతో కూడిన విషయాలు.

- జనమ్ముందు గర్వంతో మాట్లాడకు. భూమిపై నిక్కుతూ నీల్గుతూ నడవకు. తననుతాను పొగడుకునే, మిడిసిపడే వాడ్ని దేవుడు ఏమాత్రం మెచ్చుకోడు.

- నీ నడకలో మధ్యేమార్గం అవలంబించు.

- నీ కంఠస్వరం కాస్త తగ్గించుకో. అన్ని స్వరాల కంటే గాడిద స్వరం అత్యంత కఠోరమయినది." (లుఖ్మాన్: 17-19)

2) ఆహార పానీయాలకు సంబంధించిన నిషేధితాలు

♦ అల్లాహ్ మనకు చచ్చిన పశువుల్ని, చిందిన రక్తాన్ని, పంది మాంసాన్ని నిషేధించాడు. అలాగే గోర్లుండి మాంసాన్ని భక్షించే జంతువులు కూడా నిషిద్ధమే. ఇస్లామీయ జిబహ్ పద్ధతి (హలాల్ పద్ధతి) ప్రకారం కోయబడని ప్రతి జంతువు మాసం నిషిద్ధమే. అలాగే అల్లాహ్ పేరు తీసుకోకుండా కోయబడిన ఏ జంతువు మాంసమైనా నిషిద్ధమే.

♦ ఇక సముద్ర జంతువులంటారా, అవి అన్ని హలాల్. దైవ ప్రవక్త (స) సముద్రం గురించి ఇలా అన్నారు: సముద్రం - దాని నీరు పరిశుద్ధమైనది, దాని మరణించిన జంతువు ధర్మసమ్మత మైనది. (అబూదావూద్, తిర్మిజీ, నసాయి)

♦ ఆహార పానీయాల్లో అల్లాహ్ మనకు నిషేధించిన వాటిలో - మతిని పోగొట్టే మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు కూడా ఉన్నాయి. (ఏ పానీయం, పదార్థం ఎక్కువ మోతాదులో తీసుకుంటే మత్తెక్కుతుందో దాని తక్కువ పరిమాణం కూడా నిషిద్ధమే). మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు మనిషి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తాయి, అతనిని ఆర్థికంగా దివాలా తీస్తాయి.

ఆయన మీకు చచ్చిన పశువుల్ని, రక్తాన్ని, పందిమాంసాన్ని, అల్లాహ్ యేతరులకు నైవేద్యం పెట్టిన పదార్థాలను, (అక్కడి మాంసాహారాన్ని) నిషేధించాడు. అయితే దైవాజ్ఞలు ఉల్లంఘించే

**మిగతా 27వ పేజీలో...**

# ఉర్దూ లైబ్రరీల కథ!

నిలోఫర్



**దేశంలో** ఉర్దూ భాష ముస్లిం భాషగా భావించబడుతుంది. ఉర్దూ చదివేవారు తగ్గిపోయారు. ఉర్దూ లైబ్రరీలపై ఇది ప్రభావం చూపుతోంది. క్రమేపి ఉర్దూ లైబ్రరీలు పోటీ పరీక్షల పుస్తకాలను అందించడం ప్రారంభించాయి.

దేశంలోని వివిధ ప్రాంతాలలోని ఉర్దూ లైబ్రరీలు చదివే పాఠకుల సంఖ్య క్షీణిస్తున్నందున, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను జోడించడం ద్వారా ప్రస్తుతం అనేక ఉర్దూ లైబ్రరీలు మనుగడ సాగిస్తున్నాయి.

1978లో స్థాపించబడిన కలకత్తాలోని అలంబజార్ ఉర్దూ లైబ్రరీ ప్రధానంగా రాష్ట్రంలోని ఉర్దూ మాట్లాడే ముస్లిం సమాజం అవసరాల నిమిత్తం ఏర్పాటు చేయబడినది. సమీపం లోని స్థానిక ఉర్దూ మీడియం హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థుల అవసరాలను తీర్చడానికి లైబ్రరీ స్థాపించబడింది. అలంబజార్ ఉర్దూ లైబ్రరీలో పెద్ద సంఖ్యలో ఉర్దూ నవలలు, ఉర్దూ పుస్తకాలు ఉన్నాయి.

కాలక్రమేణా మారుతున్న సమాజ అవసరాలకు తగినట్లుగా అలంబజార్ ఉర్దూ లైబ్రరీలో పాఠకులను ఆకర్షించేందుకు అకడమిక్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. మెడికల్, ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం కోసం ITI, NEET, ఇతర అనేక రకాల ప్రవేశ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పోటీ పరీక్షలు, బ్యాంకులు, రైల్వేలు, ఇతర పరీక్షల కోసం సిద్ధమయ్యే పుస్తకాలను అందించడం జరుగుతుంది.

అక్టోబర్ 1891లో బీహార్‌లో ఖుదా బక్ష్ ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీ ప్రారంభించబడింది. ప్రారంభంలో లైబ్రరీలో 4వేల మాన్యుస్క్రిప్ట్‌లు ఉండేవి. వాటిలో 1,400 ఖుదా బక్ష్ తండ్రి నుండి వారసత్వంగా లభించాయి. భారత ప్రభుత్వం ఖుదా బక్ష్ ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీని 1969లో పార్లమెంటరీ చట్టం ద్వారా జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా గుర్తించింది.

పాట్నాలో ఉన్న ఖుదాబక్ష్ ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీని దేశ విదేశాలు సందర్శించి మాన్యుస్క్రిప్ట్‌లు సూఫీ సాహిత్యం, కవిత్వం, పర్షియన్ సాహిత్యం, చరిత్ర, సూక్ష్మ చిత్రాలను అధ్యయనం చేస్తున్నారు. ఖుదా బక్ష్ ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీలో మానవీయ శాస్త్రాలు, సాంఘిక శాస్త్రాల పుస్తకాలు క్రీ.శ 1600-1700 సంవత్సరాల నాటివి ఉన్నాయి.

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సివిల్ సర్వీసెస్ పరీక్షల తయారీపై ఖుదా బక్ష్ ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీ దృష్టి సారించింది. ఖుదా బక్ష్ ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీ, మెడికల్, ఇంజనీరింగ్ రంగాలకు సంబంధించిన పోటీ పరీక్షల మెటీరియల్‌లను విద్యార్థులకు అందుబాటులో ఉంచింది. లైబ్రరీలోని ది కర్జన్ రీడింగ్ రూమ్‌ను పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇష్టపడతారు.

రాంపూర్ రజా లైబ్రరీ, 1774లో నవాబ్ ఫైజుల్లా ఖాన్ స్థాపించారు. విద్వాంసులు, ఉలేమాలు, కవులు, చిత్రకారులు, కాలిగ్రాఫర్లు, సంగీత విద్వాంసులను నవాబు ఆదరించారు. లైబ్రరీలో అరబిక్,

పర్షియన్, సంస్కృతం, ఉర్దూ, హిందీ, టర్కిష్‌తో సహా వివిధ భాషలలో మాన్యుస్క్రిప్ట్‌లు ఉన్నాయి.

ఖుదా బక్ష్ ఓరియంటల్ పబ్లిక్ లైబ్రరీ, రాంపూర్ రజా లైబ్రరీ రెండూ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ కింద కేంద్ర నిధులు పొందుతున్నాయి.

1939లో స్థాపించబడిన, భోపాల్‌లోని ఇక్బాల్ లైబ్రరీలో పుస్తకాలను డిజిటలైజ్ చేయడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. యువ తరంలో ఉర్దూ పట్ల క్షీణిస్తున్న ఆసక్తిని పెంచడమే లక్ష్యంగా, ఉర్దూ పరిరక్షణ కోసం ఇక్బాల్ లైబ్రరీ పనిచేస్తుంది.

ఇక్బాల్ లైబ్రరీ రీడింగ్ రూమ్‌లో వార్తాపత్రికలు, మ్యాగజైన్‌లను అందుబాటులోకి తేవడం జరిగింది. పోటీ పరీక్షలకు సంబంధించి లక్షకు పైగా పుస్తకాలను సేకరించడం ద్వారా ఇక్బాల్ లైబ్రరీ తన పాఠకుల సంఖ్యను పెంపొందించుకునే ప్రయత్నం చేస్తోంది.

హైదరాబాద్‌లో ఉర్దూను ప్రోత్సహించడానికి ఇదారా-ఎ-అదబియాత్-ఎ-ఉర్దూ సంస్థను ఏర్పాటు చేయడం జరిగింది. 1930లలో ఇదారా-ఎ-అదబియాత్-ఎ-ఉర్దూ (ఉర్దూ సాహిత్య సంస్థ) దక్కని సాహిత్యవేత్త, సాహిత్య చరిత్రకారుడు ముహియుద్దీన్ ఖాద్రీ 'జోరి'చే స్థాపించబడింది. తరువాత దాని వ్యవస్థాపకులు దానిని లైబ్రరీగా మార్చి కొన్ని కోర్సులను ప్రారంభించారు.

ఇదారా-ఎ-అదబియాత్-ఎ-ఉర్దూ సంస్థలో చారిత్రక ఉర్దూ వార్తాపత్రికల సేకరణతో పాటు పురాతన ఉర్దూ, అరబిక్, పర్షియన్ మాన్యుస్క్రిప్ట్‌లు ఉన్నాయి. ఇదారా-ఎ-అదబియాత్-ఎ-ఉర్దూ లైబ్రరీలో అరుదైన ఉర్దూ పుస్తకాలు, మాన్యుస్క్రిప్ట్‌లు ఉన్నాయి. దక్కని ఉర్దూ మాన్యుస్క్రిప్ట్‌ల తొలి ప్రతులు ఉన్నాయి. ఇది దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి పరిశోధకులను ఆకర్షిస్తుంది.

ఉర్దూ లైబ్రరీలు కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఉర్దూ లైబ్రరీలను సామాన్య ప్రజలు సాధారణంగా సందర్శించరు. పరిశోధకులు, పండితులు మాత్రమే ఈ లైబ్రరీలను సందర్శిస్తారు పాఠకుల సంఖ్యను పెంచే సాంకేతికతలు, పోటీ పరీక్షల కోసం చదివే గదులు, పోటీ పరీక్షల గురించి పుస్తకాలు అందుబాటులోనికి తీసుకు రావలసి ఉన్నది. లైబ్రరీలు తమ మౌలిక సదుపాయాలను విస్తరించి, డిజిటలైజేషన్‌పై దృష్టి పెట్టాలి.

**25వ పేజీ తరువాయి...**

ఉద్దేశ్యం లేకుండా, హద్దు మీరకుండా గత్యంతరం లేని పరిస్థితిలో మాత్రం (ఈ నిషేధితాలు) తినవచ్చు. అందులో తప్పు లేదు. నిశ్చయంగా అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడు. (అల్-బఖరహ్: 173)

3) ధార్మిక వ్యవహారాలు, దాని చిహ్నాలకు సంబంధించిన నిషేధితాలు.

నేనీ రోజు మీకోసం మీ ధర్మాన్ని (సమగ్ర జీవన వ్యవస్థగా) పరిపూర్ణం చేశాను. మీ కోసం నా అనుగ్రహాన్ని పూర్తిగా నెరవేర్చాను. మీ శ్రేయస్సు కోసం ఇస్లాంను మీ జీవనధర్మంగా ఆమోదించాను. (అల్-మాయిదహ్: 03)

♦ ఈ ఆయతును బట్టి ఇస్లాం ధర్మ మూల విషయాల్లో, స్థిర సిద్ధాంతాల్లో మార్పు చెయ్యడానికి వీలు లేదు. యూదులలో ఓ వ్యక్తి ఉమర్(ర) గారిని ఉద్దేశించి చెప్పిన మాట- ఒకవేళ ఈ ఆయతు వంటి ఓ ఆయతు మాపై అవతరించి ఉంటే దాని అవతరణా దినాన్ని ఓ మహోత్సవంగా, పండుగ దినంగా చేసుకుని ఉండేవారము. (బుఖారీ)

ధ్రువీకరించబడిన హదీసులో హజ్రత్ ఇర్బాజ్ బిన్ సారియహ్ (ర) గారి కథనం: దైవ ప్రవక్త (స) మమ్మల్ని ఉద్దేశించి ఓ అద్భుత హితబోధ చేశారు. ఆ హితబోధకు మా అందరి కళ్ళు చెమర్చాయి, మా అందరి హృదయాలు ద్రవించాయి. అప్పుడు మేము ప్రవక్త (స) వారినుద్దేశించి - యా రసూలల్లాహ్! ఈ మీ హితబోధ మా కోసం మీ చివరి హితబోధేమో అనిపిస్తుంది. ఈ సందర్భంగా తమరు మాకు ఏమైనా తాకీదు చేయాలనుకుంటున్నారా? అని విన్నవించుకున్నాము. దానికి ఆయన ఇలా అన్నారు: నేను మిమ్మల్ని ప్రకాశమానమైన మార్గం మీద వదిలాను. దాని రాత్రి పగటి వలే కమ్మటిమయమై ఉంది. నా తర్వాత పరమ దౌర్భాగ్యవంతుడే ఆ దారిని తప్పుతాడు. (ఇబ్ను మాజహ్)

వేరొక సందర్భంలో దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:

మా ధర్మంలో లేని విషయాన్ని జొప్పిస్తే అది రద్దు చెయ్యబడుతుంది. (బుఖారీ, ముస్లిం)

అల్లాహ్ అవతరింపజేయని, దైవప్రవక్త (స) సెలవియ్యని నూతన పోకడలను ధర్మంలో ప్రవేశ పెడితే దాన్ని ప్రవేశపెట్టిన వ్యక్తి వైపునకే అది తిరిగి మరల్చబడుతుంది. దైవప్రవక్త (స) ధర్మంలో ప్రవేశపెట్టబడిన ప్రతి నూతన పోకడ మార్గభ్రష్టత్వమే అని వక్కాణించారు. (సహీహ్ ముస్లిం)




అక్టోబర్1, 1953 మద్రాస్ నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోయింది. ఆంధ్ర ప్రజలు మద్రాస్‌ను తమ రాజధానిగా కోల్పోయారు. అప్పటి శాసనసభలో గుంటూరు, కర్నూల్‌కి జరిగిన ఓటింగ్‌లో ఒక్క ఓటుతో కర్నూల్ రాజధాని అయ్యింది. అయితే నవంబర్ 1, 1956లో మళ్ళీ ఆంధ్ర ప్రజలు అప్పటి తాత్కాలిక రాజధాని అయిన కర్నూల్‌ను కోల్పోయి, తెలుగు రాష్ట్రాల విలీనం కోసం రాజధానిగా హైదరాబాద్‌కు పట్టం కట్టారు. రెండు దశాబ్దాల తరువాత 2014లో ఆంధ్ర, తెలంగాణ విభజన జరిగింది. విభజన అనంతరం తమది అనుకున్న రాజధాని హైదరాబాద్‌ను కూడా కోల్పోయారు. 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అమరావతి రాజధాని అని ప్రకటించింది. చంద్రబాబునాయుడు గారు ఆంధ్రప్రదేశ్ కోసం ఒక అద్భుతమైన రాజధానిని నిర్మిస్తున్నాం, మీ సహకారం కావాలి అన్నారు. రైతులు స్వచ్ఛంధంగా వచ్చి తమ భూములను ప్రభుత్వానికి అప్పజెప్పారు. రాజధాని పనులు ప్రారంభం అయ్యాయి. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం గెలిచిన తర్వాత మూడు రాజధానులు చట్ట ప్రతిపాదనతో ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి ఆటంకం ఎదురయ్యింది. ఈ విధంగా భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు తమది అనుకున్న ప్రతి రాజధాని ఆంధ్రులకు దూరమవుతూ అందని ద్రాక్షలా తయారయ్యింది.

అమరావతిని రాజధానిగా ప్రకటించిన చంద్రబాబునాయుడు కేంద్రం నుండి ప్రత్యేక హోదా రాకుంటే కనీసం పెద్దఎత్తున నిధులయినా సేకరించగలరా? అనే ప్రశ్నకు కొంతవరకు ఇప్పుడు జవాబు దొరికింది. రాజధాని కల నెరవేరనుందా అనేది ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రశ్న. బడ్జెట్‌లో కేంద్రం నుండి కేటాయింపు సాధించగలిగారు. విభజన అనంతరం హైదరాబాద్ పది సంవత్సరాలపాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని ఎగ్రిమెంట్ జరిగింది. ఇది 2024లో ఇప్పుడు గడువు ముగిసింది. 2014లో అప్పటి ప్రభుత్వం కృష్ణా నదికి దక్షిణ భాగంలో 216 కి.మీ విస్తీర్ణం కలిగిన ఒక ప్రాంతాన్ని ఎంచుకుని ఈ ప్రాంతంలోనే రాజధాని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ ప్రాంతంలోనే రాజధాని నిర్మించడానికి కారణం అటు ఉత్తరాంధ్ర, ఇటు దక్షిణాంధ్రకి మధ్యలో ఉంటుంది ఈ ప్రాంతం. అంతేకాదు ఇప్పటివరకూ ప్రపంచంలో ఏ నగరాలైతే నది ఒడ్డున ఉన్నాయో, అవి వేగంగా అభివృద్ధి చెందుతాయని, వ్యాపారాలు కూడా ఎక్కువగా జరుగుతాయని, ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని కృష్ణా నది ఒడ్డున అమరావతి నిర్మించేందుకు అప్పటి సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఈ అమరావతి నగరాన్ని నిర్మించడానికి చంద్రబాబు నాయుడు ప్రపంచంలో పేరుగాంచిన లండన్, సింగపూర్ నిపుణులను నియమించారు. అమరావతి కోసం ఒక ఉత్తమమైన ప్రణాళిక ఇవ్వమని కోరారు. వారు తయారు చేసిన ప్లాన్‌లో వారు అమరావతిని మూడు భాగాలుగా విభజించారు. 1) కోర్ క్యాపిటల్ ఏరియా. ఇందులో రాష్ట్రాన్ని నడిపించే ప్రభుత్వానికి సంబంధించిన అన్ని సంస్థలు ఉంటాయి 2) క్యాపిటల్ సిటీ ఏరియా 3) క్యాపిటల్ రీజియన్ ఏరియా. అమరావతిలోనే రాష్ట్రానికి సంబంధించిన అన్ని భవనాలు ఉంటాయి. హైకోర్టు, విధాన సభ, సచివాలయం, ముఖ్య శాఖలు, అందులో పనిచేసే అధికారులు ఉండేందుకు సదుపాయాలు ఉంటాయి. దాంతోపాటు ఈ నగరాన్ని తొమ్మిది జోన్‌లుగా డివైడ్ చేశారు.

1) గవర్నమెంట్ సిటీ 2) జస్టిస్ సిటీ 3) ఫైనాన్స్ సిటీ 4) నాలెడ్జ్ సిటీ 5) ఎలక్ట్రానిక్ సిటీ 6) హెల్త్ సిటీ 7) స్పోర్ట్స్ సిటీ 8) మీడియా సిటీ 9) టూరిజం సిటీ ఏర్పాటు చేశారు. దాంతోపాటు ఈ స్మార్ట్ సిటీకి 22 కి.మీ రివర్ ఫ్రంట్ కూడా ఉంటుంది. ఈ మొత్తం నగరాన్ని నిర్మించేందుకు యాభై వేల కోట్లు ఖర్చు అవుతాయని 2014లో బడ్జెట్ ప్లాన్ చేశారు. 2024 కల్లా ఇది పూర్తవుతుందని అన్నారు. ఇదంతా తెలిసిన అమరావతి ప్రజలు స్వచ్ఛంధంగా 28,181 మంది రైతులు ముప్పై ఐదు వేల ఎకరాల భూమిని ప్రభుత్వానికి అప్పజెప్పారు. దీనికిగాను సారవంతమైన ఎకరం భూమికి అమరావతి నిర్మాణం తరువాత 1250 గజాల నివాస ప్రాంతం, 450 గజాల వాణిజ్య ప్రాంతం (కమర్షియల్ ఏరియా) అని అదే బంజరు భూమిని ఇచ్చిన రైతులకు వెయ్యి గజాల నివాస ప్రాంతం, 250 గజాల కమర్షియల్ ఏరియా అని దానితోపాటు అమరావతి నిర్మాణానికి పది సంవత్సరాలు

పడుతుంది కాబట్టి సారవంతమైన భూమి ఇచ్చినవారికి ఎకరానికి ఏభైవేల రూపాయలు, బంజరు భూమిని ఇచ్చినవారికి ఎకరానికి ముప్పై వేల రూపాయలు సంవత్సరానికి ఇస్తామని అప్పటి ప్రభుత్వం హామి ఇచ్చింది. దాంతో రైతులు ఆనందపడి తమ భూములను ప్రభుత్వానికి ఇచ్చారు. చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఈ ఆఫర్‌కి 29గ్రామాలకు చెందిన 28వేల మంది రైతులు స్వతహాగా దాదాపు 35వేల ఎకరాల భూమిని ఇచ్చారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాము, రాష్ట్ర ప్రజల జీవితాల్ని తీర్చిదిద్దుతామంటే ప్రజలు ఈ విధంగా ముందుకొచ్చారు. ప్రభుత్వాలు ఏదైనా ఒక ప్రాజెక్ట్ మొదలుపెట్టే ముందు నోడల్ ఏజెన్సీ ఏర్పాటుచేస్తారు. ఆ ఏజెన్సీ రకరకాల పద్ధతుల ద్వారా డబ్బును సేకరించి ప్రాజెక్ట్‌ను పూర్తి చేస్తుంది. దీనిపేరు (Andhra Pradesh Capital Region Development Authority) దీన్నే APCRDA అంటారు. దీని ముఖ్యమైన పని పది సంవత్సరాలలో అమరావతి నిర్మాణానికి కావలసిన మొత్తం డబ్బు ఏర్పాటు చేయటం.వీరు కొన్ని ప్రభుత్వ బాండ్స్‌ను ఇష్యూ చేశారు. వాటితో దాదాపు రూ.3,846 కోట్లు రైజ్ చేయగలిగారు. అప్పట్లో పెద్ద పెట్టుబడిదారులు ఇందులో చేరారు. తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వరల్డ్ బ్యాంక్ దగ్గర మూడు వందల మిలియన్ డాలర్లు తీసుకువచ్చారు. సింగపూర్ నుండి కూడా అనేక ప్రైవేట్ సంస్థలు ఈ అమరావతిలో ఇన్వెస్ట్ చేసేందుకు ముందుకు వచ్చాయి. వీటితోపాటు సెంట్రల్ గవర్నమెంట్, స్టేట్ గవర్నమెంట్, పీఎస్‌యు, స్వయంగా ఆర్‌బీఐ కూడా ఇలా అనేక సంస్థలు అమరావతిలో భూములు కొని తమ డబ్బులను పెట్టుబడి పెట్టాయి. అనేక ప్రైవేట్ సంస్థలవారు స్కూల్స్, కాలేజీ, హాస్పిటల్స్ రకరకాల ఆఫీసులు కట్టేందుకు ముందుకు వచ్చారు. రాజధాని నిర్మాణం పనులు మొదలయ్యాయి. దాదాపు పదివేల కోట్ల రూపాయలు ఖర్చయ్యాయి. పెద్దపెద్ద కట్టడాలు కనబడసాగాయి. దాంతో ప్రజలు అమరావతి 2024 కల్లా అయిపోతుంది అనుకున్నారు. కానీ 2019 ఎన్నికలలో ప్రభుత్వం మారింది. వచ్చిన ప్రభుత్వం మొట్టమొదట చెప్పిన మాట అమరావతి కట్టేది లేదు. దాంతో ఆంధ్ర ప్రజల అమరావతి కల చెదిరిపోయింది. మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకువచ్చారు. ఈ ప్రభుత్వ హయాంలో కట్టడాలన్నీ ఆగిపోయాయి. పెద్దపెద్ద భవనాలు అలాగే ఉండి పోయాయి. వాటి చుట్టూ గడ్డి, చెట్లు పెరిగి నిర్వీర్యంగా మారిపోయాయి. ఇలా అమరావతి కథ ముగిసిపోయింది అనుకున్నారు. భూములు ఇచ్చిన రైతులకు వారి పరిహారాలు ఆపేశారు. కొత్త ప్రభుత్వం అమరావతి మొత్తం ప్రాజెక్ట్ ఆపేసింది. ఈ విషయంపై రైతులు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు వెళ్ళారు. అక్కడ గెలిచినా ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తీసుకెళ్ళింది. దాంతోపాటు అమరావతిలో డబ్బులు పెట్టుబడి పెట్టిన కాంట్రాక్టర్లు, ఇన్వెస్టర్లు ఘోరంగా మునిగిపోయారు. అక్కడి అమరావతి కథ ముగిసి పోయిందని అనుకున్నారు అందరూ. అయితే 2024లో మళ్ళీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. ఆంధ్ర ప్రజల కల మళ్ళీ మొదలయ్యింది. పోయినసారి పొరపాటు జరిగింది. ఐదు సంవత్సరాలు కాదు ఈసారి రెండున్నర సంవత్సరాలలో అమరావతి నిర్మిస్తానని చెప్పారు. ఇప్పుడు అమరావతి నిర్మాణం మొదలుపెట్టబోతున్నారు. దీని నిర్మాణానికి ధనం ఎక్కడ నుండి వస్తుంది? ఇప్పటికీ పదివేల కోట్ల రూపాయలు పెట్టినవారు నష్టపోయారు. ఇప్పుడు మళ్ళీ అమరావతి నిర్మించేందుకు యాభై వేల కోట్లు కాదు, లక్ష కోట్లు అవసరమంటున్నారు? మరి అంత ధనం ఎక్కడి నుండి వస్తుంది? పైగా 2014లో ఆంధ్రప్రదేశ్ తీసుకున్న మూడు వేల ఎనిమిది వందల కోట్లరూపాయలు అప్పుడే వడ్డీ పెరిగి ఇప్పుడు ఆ డబ్బు కట్టాల్సిన సమయం వచ్చింది. వాటిని ఎలా తీరుస్తారు? ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సరిగ్గాలేదు. గత ప్రభుత్వం సంక్షేమ పథకాల పేర రాష్ట్రంలో అప్పు పెరిగింది. ప్రభుత్వం దాదాపు నాలుగు లక్షల యాభై ఆరు వేల కోట్ల రూపాయలు ప్రజలకు ఫ్రీగా పంచింది. దాంతో ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యింది. మరి ఇప్పుడు చంద్రబాబు కూడా కొన్ని సంక్షేమ పథకాలు ఇస్తామని ప్రజలకు ఎన్నికల ముందు వెల్లడించారు. వాటిని అమలు చేస్తే దాదాపు ఇరవై ఒక్క వేల కోట్ల అదనపు ఖర్చు అవుతుంది. ఇటు సంక్షేమ పథకాలు ఇవ్వాలి, అటు రాజధాని నిర్మాణం జరగాలి. ఎలా అనేది ప్రశ్న? ఇంత ధనం ఎక్కడి నుండి తెస్తారు. దీనిపై ఇప్పటి ప్రభుత్వం మేము డబ్బు తెచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నాం, మళ్ళీ బ్యాంకులను, అప్పు అడుగుతాం, ఇన్వెస్టర్లను కూడా రమ్మని రిక్వెస్ట్ చేస్తాం అని హామి ఇస్తున్నారు. చంద్రబాబు అమరావతిని స్మార్ట్ సిటీగా చేస్తాం అని ఎంతో ధైర్యంగా హామి ఇస్తున్నారు.

ముఖ్యమంత్రి అంత ధైర్యంగా చెప్పడానికి కారణం కేంద్రం. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇస్తుందని భరోసా. 2024 కేంద్ర ప్రభుత్వం నిర్మాణంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పాత్ర చాలా ముఖ్యమైనది. ఆయన కేంద్రానికి మద్దతు ఇచ్చి ప్రభుత్వం ఏర్పడటంలో కీలక పాత్ర వహించారు. ఆంధ్ర ప్రజలు కూడా ఈ కూటమి ప్రభుత్వం రాష్ట్ర రాజధాని కోసం సహాయం చేస్తుందనే నమ్మకంతోనే ఈ ప్రభుత్వాన్ని గెలిపించారు. ఇక ఈ ప్రభుత్వాలు తను ఇచ్చిన మాటను, నిలబెట్టుకుంటారని ప్రజల కలను వమ్ము చేయరని ప్రతి ఒక్కరి అంచనా. దీనికోసం మరో ఐదు సంవత్సరాలు వేచి చూడవలసిందే. ముఖ్యమంత్రి ఎంత మేరకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి మేలు చేకూరుస్తారో, ప్రత్యేక హోదా గురించి కేంద్ర ప్రభుత్వంను ఒప్పిస్తారో వేచిచూడాల్సిందే.

# నోరు మంచిదైతే...

నసీరా బేగం

**ఒకసారి** ఇమామ్ అబూహనీఫా(ర) దావూద్ తాయితో ఇలా అడిగారు; మీరు ఇంట్లోనే ఎక్కువ సమయం ఎందుకు ఉంటు న్నారు? అని. దానికి దావూద్ తాయి, నేను నా మనసుతో పోరాడుతూ ఉంటాను అని సమాధానమిచ్చారు. దానికి అబూ హనీఫా(ర) గారు ఎందుకు పోరాడుతున్నారు? ఎలా పోరాడు తున్నారు? అని అడిగారు. దానికి దావూద్ తాయి నా నాలుక కత్తెర మాదిరిగా పనిచేస్తోంది. దానిని అదుపులో పెట్టే ప్రయత్నం చేస్తున్నాను అని సమాధానమిచ్చారు. అబూ హనీఫా(ర) అన్నారు: ఇదేమి పోరాటం? ఇంటి నుండి బయలు దేరండి. బయటకు వచ్చి చర్చలు, గోష్టులలో పాల్గొనండి. అక్కడ మీ మనసుతో పోరాడండి అని అన్నారు. గురువు గారు చెప్పిన ప్రకారం దావూద్ తాయి ఇంటి నుంచి బయటకు వచ్చి చర్చలు, గోష్టులలో పాల్గొనటం ప్రారంభించారు. అప్పుడు అక్కడ తెలిసింది ఆయనకు మనసుతో చేసే పోరాటం ఎటువంటిదో? అందరి మధ్యలో కూర్చొని నాలుకను అదుపులో ఉంచటం ఎంత కష్టమైన పనియో?

నాలుకతో పలికే మాటలు నాలుగు రకాలుగా ఉంటాయి. ఒక రకం మాటలు పెదాలనుంచి వెలువడి శిఖరాలు ఎక్కిపోతాయి. ఇవి ఏదో ఒక ఆపదను తప్పకుండా మోసుకొస్తాయి. రెండో రకం మాటలు, అందులో ఎవరికీ ఎలాంటి లాభాలు ఉండవు. నష్టాలు కలగవు. సమయం వృధా చేస్తాయి. మూడో రకం మాటలు, కొంతమందికి లాభాలను చేకూర్చుతాయి. మరికొంత మందికి నష్టాన్ని చేకూర్చుతాయి. నాలుగో రకం మాటలు, వాటిలో పూర్తిగా లాభాలే ఉంటాయి. అత్యుత్తమమైనవే ఉంటాయి. మనిషికి ఉపయోగపడే విధంగానూ, జీవితాలను సరిదిద్దేవిగానూ ఉంటాయి.

దీనిద్వారా తెలిసే విషయమేమిటంటే, మూడువంతుల మాటలు అనసరమైనవే ఉంటాయి. ఒకవంతు మాటలు ఉపయోగ పడేవిగా ఉంటాయి. కనుకనే దైవప్రవక్త(స) మీరు రెండింటి గురించి హామి ఇస్తే నేను మీకు స్వర్గం లభిస్తుందని హామి ఇస్తాను అని సెలవిచ్చారు. అవి 1) నాలుక 2) మర్మాంగం.

దీనిద్వారా రెండు దవడల మధ్య ఉండే ఈ చిన్న నాలుక ఎంత ముఖ్యమైనదో స్పష్టంగా అర్థమవుతోంది. అనవసరమైన, పలకకూడని మాటలు నరకానికి చేరువ చేస్తే, మంచి మాటలు, అవసరమైన మాటలు, ఉత్తమ బోధనలు మనిషిని స్వర్గానికి చేరువ చేస్తాయి. కొన్ని రకాల మాటలు ప్రజలకు నష్టాన్ని కలిగిస్తాయి. నిరాశా నిస్పృహలలో నెట్టివేస్తాయి. నాలుక పలికే కొన్ని రకాల మాటలు ప్రజలకు ఉత్తేజాన్ని చేకూర్చుతాయి. ప్రగతి సోపానాలు ఎక్కే విధంగా ఆశాకిరణాలు చూపుతాయి. నాలుక ద్వారా కలిగే లాభనష్టాలు ఇతరులకు మాత్రమే కదా కలుగు తాయి అని అనుకుంటే అది పెద్ద పొరపాటే. ఆ లాభనష్టాలు అందరికంటే ముందు మాట్లాడిన వ్యక్తికే కలుగుతాయి. మనిషి మాట్లాడిన ప్రతి మాట దైవదూతల ద్వారా లిఖించబడుతుంది. దానికి తప్పకుండా సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. కనుకనే బెత్తెడు ఉండే ఈ నాలుక పట్ల అత్యంత జాగరూకతతో ఉండటం తప్పనిసరి. కనుకనే మహామహులు అధికంగా వింటారు. అతి తక్కువగా మాట్లాడతారు. ప్రతి మనిషి వ్యక్తిత్వం అతని నాలుక క్రిందనే గోప్యంగా ఉంటుంది. అతని మాటల

ద్వారానే అతని వ్యక్తిత్వాన్ని అంచనా వెయ్యటం జరుగుతుంది.

హజ్రత్ ఈసా(అ) గారితో ఇలా అడగటం జరిగింది. ఒకవేళ పుణ్యకార్యాలకు సంబంధించిన పది భాగాలు ఉంటే వాటిని మీరు ఎలా విభజిస్తారు అని. దానికి ఆయన ఇలా సమాధాన మిచ్చారు; తొమ్మిది భాగాలు నిశ్శబ్దంగా ఉండటంలోను, ఒక భాగం దూరంగా ఉండటంలోను విభజిస్తాను అని. అంటే ప్రజలలో ఉండి కూడా నిశ్శబ్దంగా ఉండటం, అనవసర మైన మాటలకు దూరంగా ఉండటం ఉత్తమ విషయంగా విశదీకరించారు.

ఇమామ్ షాఫయి (ర)ని బుద్ధివికాసాలను పెంచే విషయాలేమైనా ఉంటే తెలియజెయ్యండి అని అడగటం జరిగింది. దానికి ఆయన ఇలా సమాధానమిచ్చారు. మూడు విషయాలను జ్ఞాపక ముంచుకోండి 1) జ్ఞానవంతుల సాంగత్యాన్ని ఎంచుకోండి 2) మంచి వారితో స్నేహం చెయ్యండి 3) వృధా మాటలు మాట్లాడటం మానుకోండి.

హజ్రత్ మారూఫ్ కర్ఖీ(ర) ఇలా అన్నారు: అనవసరంగా మాట్లాడే వారిని, వృధా మాటలు మాట్లాడేవారిని అల్లాహ్ నిరాధారంగా వదిలివేస్తాడు అని. ఆలోచించవలసిన విషయమేమిటంటే, ఎవరినైతే నిరాధారంగా వదిలివేస్తాడో వారికి ఆధారం ఎవరుం టారు? అతనికి ఆశ్రయమెవరిస్తారు? అల్లాహ్ ఎవరినైతే వదిలి వేస్తాడో అతను నష్టపోతాడు. ఇంకా ఇతరులకు కూడా నష్టాన్ని చేకూర్చుతాడు.

దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారని హజ్రత్ అబూహురైరా(ర) ఉల్లేఖించారు: ప్రజలలో పాపాత్ముడు ఎవడంటే అర్థం పర్థంలేని వృధా మాటలు మాట్లాడేవాడు.

అనవసరమైన మాటలు మాట్లాడే వ్యక్తిలో ఎన్నో దుష్కార్యాలు ఉత్పన్నమవుతాయి. తన గొప్పలు తానే చెప్పుకుంటూ తిరుగు తాడు. ఇతరుల వీపు వెనుక చాడీలు చెపుతూ తిరుగుతాడు. అపనిందలు వేస్తూ ఉంటాడు. ఎత్తిపొడుస్తూ ఉంటాడు. తిట్లు కూడా అతి తేలికగా తిడుతూ ఉంటాడు. ఇటువంటి వ్యక్తికి పాపం తప్ప మరేమి లభిస్తుంది? నాలుక ముల్లు అత్యంత ప్రమాదకరమైనది. ఇట్టే గుచ్చుకుని గాయపరుస్తుంది. పాము విషం కంటే కూడా అది అత్యంత విషకరమైనదిగా ఉంటుంది. బాణం గాయమైనా నయమవుతుంది కాని మాటల గాయం ఎన్నటికీ నయమవ్వదు.

ఒకసారి దైవప్రవక్త ముహమ్మద్(స) మస్జిదె నబవీలో ప్రవేశించారు. అక్కడ కొంతమంది ఆయన(స) గారి అనుచరులు కూర్చొని ఉన్నారు. అప్పుడు ఆయన(స) ఇలా సెలవిచ్చారు: చూడండి! ఈ ద్వారం నుంచి ఒక మనిషి ప్రవేశిస్తాడు. అతని కోసం స్వర్గం నిర్ణయింపబడి ఉంది. ఇది విన్న ఆయన(స) గారి సహచరులు ఎంతో ఉత్సుకతతో ఆ ద్వారం వైపునకే చూస్తూ కూర్చున్నారు. అంతలో ఆ ద్వారం నుంచి అబ్దుల్లాహ్ బిన్ సలామ్(ర) లోపలికి ప్రవేశించారు. వారు ఆయన(ర) గారి వద్దకు వెళ్ళి దైవప్రవక్త(స) గారిచ్చిన శుభవార్తను వినిపించి మీలోని ఏ సుగుణాల కారణంగా మీకు ఈ శుభవార్త లభించింది అని అడిగారు. దానికి ఆయన(ర) "ఓ నా స్నేహితులారా! నాలో ప్రత్యేక గుణం అంటూ ఏదీ లేదు. ఒక చిన్న ఆచరణ ఉంది అంతే. అదేమిటంటే, నేను అనవసరంగా ఏమీ మాట్లాడను. అనవసరంగా ఏ పనీ చెయ్యను. ఇతరుల గురించి చెడు ఎంత మాత్రమూ చెప్పను" అని.

దీనిద్వారా నాలుకను అదుపులో ఉంచుకోవటం ఎంత అవసరమో,ఎంతటి ప్రయోజనకరమైన విషయమో స్పష్టంగా అర్థమవుతోంది. తన నాలుక తన అదుపు లోనే ఉంటుది కాబట్టి దానిని మనిషి తనకు ఇష్టమైనట్లు వాడుకోవచ్చు. అంటే దానిని అదుపులోనూ ఉంచుకోవచ్చు లేదా ఇట్టే వదిలివేయవచ్చు కూడాను.

నాలుకను గురించి జాగ్రత్తపడేవారు ఎంత వరకు ఆలోచిస్తారంటే, తన నోటి ద్వారా ఒక మాటకు బదులు రెండు మాటలు కూడా వెలువడకూడదని. ఎందుకంటే, ఒక మాట అవసరమైనదైతే రెండోది అనవసరమైనదై ఉంటుందని.

పరిశుభ్రమైన జీవితం గడిపేందుకు, తాను స్వయంగా సుఖంగా, సంతోషంగా ఉంచేందుకు దైవప్రవక్త ఎన్నో విషయాలను ఉపదేశించారు. అందులో ఒక హితబోధ ఇలా ఉంది; ఒక మంచి వ్యక్తి ఎవడంటే, నోటిని కట్టి ఉంచేవాడు, చేతులను వదిలి ఉంచేవాడు అని. అంటే నోటిని అదుపులో ఉంచుకునే వ్యక్తి చేతులతో మంచి పనులు చేసే వ్యక్తి అన్నమాట.

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




## అలీఘర్ ముస్లిమ్ యూనివర్శిటీ ఇండియాలో బెస్ట్ యూనివర్శిటీ

అలీఘర్ ముస్లిమ్ యూనివర్శిటీ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తూనే ఉంటోంది. ఈసారి మాత్రం యూనివర్శిటీ అద్భుతమైన విజయాలతో జాతీయ ఛానళ్లలో నానుతోంది. ఇండియా టుడే నిర్వహించిన ర్యాంకింగ్స్‌లో అలీఘర్ ముస్లిమ్ యూనివర్శిటీ మొదటి స్థానంలో నిలిచింది. ఇక్కడ జరుగుతున్న వివిధ పరిశోధనలు, ఆవిష్కరణలే దేశంలో అన్ని యూనివర్శిటీల కంటే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టాయి. ఇండియా టుడే జులై సంచికలో భారత దేశంలోని ఉత్తమ కళాశాలలు' ర్యాంకింగ్ లో ఎ.ఎం.యు. మొదటి స్థానంలో నిలిచింది. చారిత్రక నేపథ్యం కలిగిన ఈ యూనివర్శిటీ స్థాపించినప్పటి నుంచి తక్కువ ఫీజులతో ప్రామాణికమైన విద్యను అందిస్తోంది. యూనివర్శిటీ అనుబంధ కాలేజీ అయిన జాకీర్ హుసేన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ అనేక విభాగాలలో మొదటి ర్యాంకును కైవసం చేసుకుంది. మొదటి ర్యాంకింగ్ దక్కడం పట్ల యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ నైమా ఖాతూన్ హర్షం వ్యక్తం చేశారు. యూనివర్శిటీ ర్యాంకింగ్ కమిటీ చైర్మన్ ప్రొ.ఎం.సలీమ్ బేగ్ మాట్లాడుతూ ఏఎంయూ అగ్రస్థానాన్ని పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. యూనివర్శిటీ మేనేజ్‌మెంట్, టీచర్లు, నాన్ టీచింగ్ స్టాఫ్, స్టూడెంట్స్ సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైందని ఎ.ఎం.యూ. పిఆర్వో ఉమర్ పిర్జాదా అన్నారు.

## దేశంలోని వివిధ కోర్టులలో 5 కోట్లకు పైగా పెండింగ్ కేసులు

దేశవ్యాప్తంగా వివిధ కోర్టులలో 5 కోట్లకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, అత్యధికంగా ఉత్తర్ ప్రదేశ్‌లోని అనుబంధ కోర్టులలో 1.18 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని లోక్‌సభకు ప్రభుత్వం తెలిపింది. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రాం మేఘ్వాల్ ప్రశ్నోత్తరాల సమయంలో లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ సుప్రీంకోర్టులో 84,045 కేసులు పెండింగ్‌లో ఉండగా వివిధ హైకోర్టులలో 60,11,678 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. పెండింగ్ కేసులు అత్యధికంగా జిల్లా, అనుబంధ కోర్టులలోనే ఉన్నాయని, మొత్తం 4,53,51, 913 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు. కేసులు పెండింగ్‌లో ఉండడానికి అనేక కారణాలు ఉన్నాయని, మౌలిక సౌకర్యాల లేమి, అనుబంధ కోర్టు సిబ్బంది కొరత, సాక్ష్యాధారాలలో సంక్లిష్టత, బార్, దర్యాప్తు సంస్థలు, సాక్షులు, కక్షిదారుల సహకారం లేకపోవడం వంటివి కారణాలలో కొన్నని ఆయన చెప్పారు.

## లండన్ థేమ్స్ నది తరహాలో మూసీ సుందరీకరణ

హైదరాబాద్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతోంది. లండన్ థేమ్స్ నది తరహాలో నగరంలోని మూసీ నదిని సుందరీకరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. ఆ దిశగా చర్యలు కూడా చేపట్టింది. అందులో భాగంగా ఇటీవల రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. బడ్జెట్‌లో నగరాభివృద్ధికి రూ.10,000 కోట్లు, ఒక్క మూసీనది సుందరీకరణకు రూ.1,500 కోట్లు కేటాయించింది. ఇక మూసీ సుందరీకరణకు భారీగా డబ్బులు అవసరం అవుతాయి. ప్రాజెక్టును పూర్తిస్థాయిలో చేపట్టేందుకు రూ.50 వేల నుంచి రూ.60 వేల కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్ నగర పరిధిలో 57.5 కిలోమీటర్ల మేర మూసీనది ప్రవహిస్తోంది. ఉస్మాన్‌సాగర్ డ్యాం డౌన్‌స్ట్రీమ్ నుంచి ఔటర్ రింగు రోడ్డు ఉత్తరం వైపునున్న గౌరెల్లి, హిమాయత్‌సాగర్ మీదుగా బాపూఘాట్ వరకు మూసీ సుందరీకరణ చేపట్టాలని నిర్ణయించారు. తొలిదశలో సుమారు రూ.4 వేల కోట్ల రుణాన్ని తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది.

## యూపీఎస్సీ చైర్‌పర్సన్‌గా ప్రీతి సుదన్

జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణ అస్తవ్యస్తంగా మారిన తరుణంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) కొత్త చైర్‌పర్సన్‌గా ప్రీతి సుదన్ నియమితులయ్యారు. ఆమె బాధ్యతలను స్వీకరించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఆమె యూపీఎస్సీ సభ్యురాలిగా ఉన్నారు. చివరగా కేంద్ర వైద్య, ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ప్రీతి సుదన్.. 2020 జులైలో పదవీ విరమణ చేశారు. ఈమె 1983 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. ఈ నెల ప్రారంభంలో వ్యక్తిగత కారణాలతో యూపీఎస్సీ చైర్మన్ పదవికి మనోజ్ సోనీ రాజీనామా చేసిన విషయం విదితమే. పదవీకాలం ముగియటానికి ముందే.. మనోజ్ సోనీ తన బాధ్యతల నుంచి తప్పుకోవటంతో యూపీఎస్సీ చైర్మన్ పదవీ నియామకం అనివార్యమైంది.

## యుఎస్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నా: కమలా హారిస్

అమెరికా అధ్యక్ష పదవికి ఎన్నికల్లో తన అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తూ ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ పత్రాలపై సంతకం చేశారు. ప్రజల బలంతో తాను చేసే ప్రచారం నవంబర్‌లో గెలిపిస్తుందని కమల హామీ ఇచ్చారు. నవంబర్‌లో ప్రజల బలంతో కూడిన ప్రచారంతో గెలుస్తానని కమలా హ్యారిస్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ధీమా వ్యక్తం చేశారు. ప్రతి వోటు సంపాదించేందుకు తాను బాగా కష్టపడతానని కూడా ఆమె ఉద్ఘాటించారు. 'అమెరికా అధ్యక్ష పదవికి నా అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటిస్తూ పత్రాలపై సంతకం చేశాను. ప్రతి వోటు సాధించేందుకు బాగా శ్రమిస్తాను. నవంబర్‌లో ప్రజల శక్తితో కూడిన మా ప్రచారం గెలుస్తుంది' అని కమలా హ్యారిస్ తన పోస్ట్‌లో తెలిపారు. నవంబర్ 5న జరగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ డెమోక్రాటిక్ అభ్యర్థిగా పోటీ చేస్తారు. ఆమె అభ్యర్థిత్వాన్ని జో బైడెన్ ఆమోదించారు.

## ఉక్రెయిన్, గాజాల్లో హింసకు ముగింపు

ఉక్రెయిన్, గాజా, మయన్మార్‌లలో హింసకు త్వరగా ముగింపు పలకాలని క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రులు పిలుపునిచ్చారు. జపాన్‌లోని టోక్యోలో క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో పాటు, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోని బ్లింకెన్, జపాన్ విదేశాంగ మంత్రి యోకో కమికావా, ఆస్ట్రేలియా విదేశాం మంత్రి పెన్నీ వాంగ్ పాల్గొన్నారు. హిందూ మహా సముద్రంలో కార్యకలాపాల విస్తరణపై, ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం క్వాడ్ నిబద్ధతను ఈ సమావేశం పునరుద్ఘాటించింది. ఈ సమావేశంలో ప్రపంచంలో వివిధ ప్రాంతాల్లో చెలరేగుతున్న భౌగోళిక, రాజకీయ పరిణామాలపై క్వాడ్ విదేశాంగ మంత్రులు చర్చించారు.

## హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్య



ఈరాన్‌లోని టెహ్రాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురయ్యారు. ఈరాన్ అధ్యక్షుడి ప్రమాణస్వీకారంలో పాల్గొనేందుకు టెహ్రాన్‌కు వెళ్లిన హనియాను చంపేశారు. హనియా ఎలా హత్యకు గురయ్యారనే వివరాలు హనియా హత్య ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని ఇరాన్ సైన్యం పేర్కొంది. హమాస్ చీఫ్ హత్యకు ఇజ్రాయెల్ నిఘా సంస్థే కారణమని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నెతన్యాహూ ప్రభుత్వం హనియాను చంపుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా గత కొంత కాలంగా ఖతర్‌లో నివసిస్తున్నారు. హనియా హత్యపై ఇప్పటివరకు అమెరికా, ఇజ్రాయెల్ స్పందించలేదు. హమాస్ చీఫ్ హనియా హత్యతో ఉద్రిక్తత మరింత పెరగనుంది.

## అమెరికా ఎన్నికల్లో ఈవీఎం లు వాడొద్దు: ఎలాన్ మస్క్



ఎన్నికల సమయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎమ్) హ్యాకింగ్‌కు గురవ్వడంపై ఎలాన్ మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలను తొలగించడంతో హ్యాకింగ్‌ను నివారించొచ్చని సూచించారు. అమెరికా నియంత్రణలోని ప్యూర్టో రికోలో ఇటీవల నిర్వహించిన ప్రైమరీ ఎన్నికల్లో అవకతవకలు చోటు చేసుకొన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఆయన పై వ్యాఖ్యలు చేశారు. "మనం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తొలగించాలి. వీటిని వ్యక్తులు లేదా ఏఐ (AI) సాయంతో హ్యాక్ చేసే ప్రమాదం ఉంది. ఇది దేశానికి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది"అని మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'పేపర్ ట్రయిల్ ఉంది కాబట్టి సమస్యను గుర్తించగలిగాము. లేదంటే ఏం జరిగి ఉండేదో అని అనుమానపడ్డారు. ఈ సమస్యలను నివారించడానికి పేపర్ బ్యాలెట్‌లను తిరిగి తీసుకురావాలని అన్నారు. అలా చేస్తే ప్రతి ఓటును లెక్కించే అవకాశం ఉంటుంది" అని అభిప్రాయపడ్డారు.

# స్నేహం

**- నుస్రత్ ఫాతిమా**

**హితం కోరేవాడు స్నేహితుడంటారు.** స్నేహితుడంటే కష్టాల్లో ఆదుకుంటాడు. ఆపదలో అండగా నిలబడతాడు. అందుకే నేస్తమే సమస్తమంటారు. మంచి వారితో స్నేహం స్వర్గ మార్గానికి దారి చూపుతుంది. చెడ్డవారితో స్నేహం నరకాగ్నికి ఆహుతి చేస్తుంది. మంచి స్నేహం, చెడ్డస్నేహాన్ని గురించి ప్రవక్త మహనీయులు ఒక ఉదాహరణద్వారా వివరించారు. మంచి వాడితో స్నేహం కస్తూరి అమ్మేవాడితో స్నేహం చేయడంతో పోల్చారు. చెడ్డవారితో స్నేహం కొలిమి వాడితో సరిపోల్చారు. కస్తూరి అమ్మేవారి సాంగత్యంలో గడిపితే కనీసం సువాసనలైనా మనకు అంటుకుని సువాసనలు వెదజల్లుతాయి. కొలిమి వాడి దగ్గర కూర్చుంటే నిప్పు రవ్వలు మన దుస్తుల్ని కాల్చడమో లేదా బొగ్గు మసి మన దుస్తులకు అంటుకుని మసిబారడమో జరుగుతుంది. మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలంటే స్నేహితులే కీలకమన్నది ప్రవక్త బోధన సారాంశం. ఒక వ్యక్తిని అంచనా వేయాలంటే అతని స్నేహితుడిని చూడాలంటారు. ఒకవేళ ఎవరి గురించైనా తెలుసుకోవాలంటే అతని స్నేహితులను చూడండి. అనే సామెత ఉంది. "అల్రజులు అలా దీనిహి ఖలీలిహీ" అన్నారు. అంటే "ఒక వ్యక్తి తన స్నేహితుడి ధర్మంపై ఉంటాడు" అని అర్థం. అందుకే మిత్రుడిని ఎంపిక చేసేముందు అతనెలాంటి వాడో క్షుణ్ణంగా చదవండి. అతని గురించి పూర్తిగా తెలుసు కోండి అని సూచించారు ప్రవక్త మహనీయులు.

ప్రళయం రోజున ఏడు రకాల మనుషులకు అల్లాహ్ తన సింహాసనం నీడన చోటు కల్పిస్తాడనే శుభవార్తనిచ్చారు ప్రవక్త మహనీయులు. ఆ రోజు పరిస్థితి చాలా భయానకరంగా ఉంటుంది. అప్పుడు ఏ నీడా కానరాదు. మనుషులంతా నగ్నంగా అల్లాహ్ ముందు హాజరవ్వాల్సి ఉంటుంది. సూర్యుడు భూమికి దగ్గరగా వస్తాడు. ఆ సమయంలో సూర్యుని వేడితో మనిషి పీకల్లోతు చెమటలో మునిగిపోయి ఉంటాడు. అలాంటి సమయంలో ఏడు రకాల మనుషులకు మాత్రం ఎలాంటి భయమూ, ఆందోళన దరిచేరదు. ఆ ఏడు రకాల మనుషుల్లో.. అల్లాహ్ కోసమే స్నేహం చేసిన వ్యక్తులను అల్లాహ్ సింహాసనం నీడన చోటు కల్పిస్తాడు. ఇలాంటి వాళ్లు కేవలం అల్లాహ్ కోసమే కలుసుకునేవాళ్లు, అల్లాహ్ కోసమే ఒకరినొకరు సహాయం చేసేవారు ఇలాంటి వాళ్లకు ఆ రోజున అల్లాహ్ సింహాసనం నీడన చోటు లభిస్తుంది. ప్రవక్త (స) తన సహచరులకు ఒక గాథను ఇలా చెప్పారు. బనీ ఇస్రాయీల్ జాతిలో ఒక వ్యక్తి తన స్నేహితుడిని కలిసేందుకు బయలుదేరాడు. దారిమధ్యలో ఒక దైవదూత అతనితో "నువ్వెక్కడికి వెళుతున్నావు" అడిగాడు. "నా ఫలానా స్నేహితుడు ఫలానా చోట ఉంటాడు అతన్ని కలిసేందుకు వెళుతున్నాను." అని అన్నాడు. దానికి దైవదూత "నీకు అక్కడ పనేమేదైనా ఉందా?" అని ప్రశ్నించాడు. దానికి అతను "నాకు మరేం పనీ లేదు. కేవలం స్నేహధర్మాన్ని నిర్వర్తించేందుకే వెళుతున్నాను" అని చెప్పాడు. అప్పుడు దైవదూత "నీ ఈ ఆచరణ అల్లాహ్‌కు ఎంతగానో నచ్చింది. అల్లాహ్ నిన్ను ఎంతగానో ప్రేమిస్తున్నాడు" అని చెప్పేందుకే అల్లాహ్ నీవద్దకు నన్ను పంపాడు అని చెప్పాడు దైవదూత. స్నేహితులంటే ఇలానే ఉండాలి. ఏమీ ఆశించకుండా చేసేదే నిజమైన స్నేహం. మనసులో ఎలాంటి కల్మషం లేకుండా, ఏమీ ఆశించకుండా స్నేహం చేసేవాడే నిజమైన స్నేహితుడన్నది ఈ గాథ ద్వారా స్పష్టమవుతుంది.

తుదిగీటు





Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**